



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 9 సంచిక : 351 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | శుక్రవారం 21 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :351 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | FRI 21 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## మోదీ, అమిత్ షాల రాజకీయ అధ్యాయం ముగిసింది

- ఎన్డీయేలో బీజేపీ ఆధిపత్యం క్షీణించిందన్న రాహుల్
- మోదీ, అమిత్ షా రాజకీయ ఆధిపత్యం తగ్గిందని వ్యాఖ్య
- కాంగ్రెస్, ఇండియా కూటమి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై మరోసారి విమర్శలు గుప్పించారు. ఎన్డీయేలో బీజేపీ రాజకీయ ఆధిపత్యం క్షీణించిందని... మోదీ, అమిత్ షా రాజకీయ

- మిగతా 2లో

## దక్షిణాది రాష్ట్రాలు ఏకతాటిపైకి రావాలి..

### మన మధ్య బలమైన సహకారం అవసరం



- దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారం పెరగాలన్న సీఎం విజయ్
- డ్రగ్స్ రహిత దక్షిణ భారతం కోసం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపు
- ఆర్థిక కూటమిగా ఏర్పడి ప్రయోజనాలు కాపాడుకోవాలని సూచన
- నీట్ రద్దు, డీలిమిటేషన్‌పై హామీ ఇవ్వాలని కేంద్రానికి డిమాండ్
- నదీ జలాల వివాదాల్లో కోర్టు తీర్పులను అమలు చేయాలని విజ్ఞప్తి

- మిగతా 2లో



## ప్రతిపక్షాలు గెలవవు.. అధికార పక్షాలే ఓడిపోతాయి..

### యువత తిరుగుబాటుపై ప్రకాశ్ రాజ్ కామెంట్స్!

పెన్ పవర్ డెస్క్:దేశ రాజకీయాల్లో యువతే కొత్త శక్తిగా మారుతోందని విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేరళలోని త్రిస్సూర్ లో ఏర్పాటు చేసిన డీవైఎఫ్ఐ రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆయన ఉద్వేగభరితంగా ప్రసంగించారు. చీజుజు శ్నపత్రం లీకేజీపై యువత చేపట్టిన ఆందోళనలను

- మిగతా 2లో

## సోనియా గాంధీ ఆత్మకథ.. రాహుల్ భావోద్వేగ పోస్ట్



పెన్ పవర్ డెస్క్:కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ జీవిత ప్రయాణంపై 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పేరిట రాసిన 544 పేజీల ఆత్మకథ నవంబరు 10న పాఠకుల ముందుకు రానుంది. తన మాతృమూర్తి జీవిత కథ పుస్తక రూపంలో రానున్న నేపథ్యంలో రాహుల్ గాంధీ

- మిగతా 2లో



## ట్రంప్‌ది 'ఆర్థిక ఉగ్రవాదం'.. ఓటమి తప్పదు

పెన్ పవర్ డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశంపై ఆర్థిక యుద్ధం ప్రకటించడాన్ని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. భారీగా అప్పులు, విపరీతంగా పెరుగుతున్న వడ్డీ ఖర్చుల వంటి స్వీయ సంక్షోభాల నుంచి దృష్టి మళ్లించే చర్యగా దీనిని పేర్కొంది. విఫలమైన విధానాలను కొనసాగించడం వల్ల ముమ్ముందు కూడా ఓటమిని, ఇరాన్ ప్రజల శత్రుత్వాన్ని మూటగట్టుకోవడం తప్ప ఏమీ సాధించలేరని తెలిపింది. అమెరికా 'ఆర్థిక ఉగ్రవాదం'..

- మిగతా 2లో

## గ్రూప్-1పై విచారణకు మేము రెడీ..

## డీఎస్సీపై సీబీఐ విచారణకు మీరు సిద్ధమా?

## చంద్రబాబుకు జగన్ సవాల్



- లోకేశ్‌ను కాపాడేందుకే గ్రూప్-1పై తప్పుడు ప్రచారమన్న జగన్
- గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల, ప్రిలిమ్స్ టీడీపీ హయాంలోనే జరిగాయని వెల్లడి
- హైకోర్టు ఆదేశాలతోనే మాన్యువల్ మూల్యాంకనం చేశామని స్పష్టీకరణ
- హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరగలేదని, సిట్ దర్యాప్తుపై విమర్శలు

- మిగతా 2లో

ఏపీ సీఎం చంద్రబాబుపై మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. డీఎస్సీ అక్రమాల నుంచి కుమారుడు నారా లోకేశ్‌ను కాపాడుకునేందుకే, ఏపీపీఎస్సీ గ్రూప్-1 పోస్టుల భర్తీపై చంద్రబాబు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని జగన్ ధ్వజమెత్తారు. గ్రూప్-1 వ్యవహారంపై సీబీఐ విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని, డీఎస్సీ కుంభకోణంపై సీబీఐ విచారణకు చంద్రబాబు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. డీఎస్సీపై దర్యాప్తు చేయాలని ఇప్పటికే కేంద్రాన్ని కోరినట్లు ఆయన తెలిపారు.

**నిజం మా వెంటనే.. న్యాయం కోసం పోరాడుతాం!**

ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ గురించి వివరించారు. 2019 ఎన్నికలకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వమే హడావిడిగా ఈ నోటిఫికేషన్ ఇచ్చిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాకముందే మే 26న ప్రిలిమ్స్ పరీక్ష కూడా పూర్తయిందని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ప్రిలిమ్స్ ఫలితాలు ప్రకటించి, 2020 డిసెంబర్‌లో మెయిన్స్ నిర్వహించామని తెలిపారు. టీడీపీ హయాంలోనే జరిగిన పరీక్షలో ఎంపికైన వారికి ఇప్పుడు రాజకీయ రంగు పులమడం దారుణమని అన్నారు.




## మూడు రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్..

### సీఎం చంద్రబాబు కీలక ప్రతిపాదన

- అమరావతి, బెంగళూరు, చెన్నైలను కుప్పం మీదుగా అనుసంధానం
- గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- విభజన సమస్యలను త్వరగా తేల్చాలని కేంద్రానికి విజ్ఞప్తి
- దక్షిణ మండల మండలి సమావేశంలో సీఎం చంద్రబాబు కీలక సూచనలు

పెన్ పవర్ డెస్క్:దక్షిణ భారతదేశంలోని మూడు కీలక రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులను కలుపుతూ అత్యంత ప్రతిష్టాత్మకమైన బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. మూడు రాష్ట్రాల రాజధానులు, ప్రధాన పారిశ్రామిక కేంద్రాలైన అమరావతి, బెంగళూరు, చెన్నైలను అనుసంధానించే ఈ హై-స్పీడ్ రైలు ప్రాజెక్టును చేపట్టాలని ఆయన సూచించారు. ముఖ్యంగా తన నియోజకవర్గమైన కుప్పం మీదుగా ఈ కారిడార్ వెళ్లేలా ప్రణాళిక రూపొందించాలని కోరారు. గురువారం మహాబలిపురంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన దక్షిణ మండల మండలి సమావేశంలో చంద్రబాబు ఈ కీలక ప్రతిపాదనలు చేశారు. ఈ మూడు నగరాలు ఇప్పటికే పారిశ్రామికంగా, సాంకేతికంగా గణనీయమైన అభివృద్ధి సాధించాయని, వాటి మధ్య హై-స్పీడ్ రైలు మార్గం ఏర్పాటు చేస్తే రవాణా వ్యవస్థ బలోపేతమై ఆర్థికాభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని

- మిగతా 2లో



## కొండా సుస్మిత వ్యాఖ్యలు బాధాకరం.. పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు

### పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

పెన్ పవర్ డెస్క్:మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. పార్టీలో ఎవరికి వారే అభ్యర్థులం అంటే కుదరదని అన్నారు. నిజామాబాద్ లో

- మిగతా 2లో

## జగన్ ఏపీపీఎస్సీ, డీఎస్సీ ఒకటే అనుకుంటున్నారు



పెన్ పవర్ డెస్క్: వైకాపా అధ్యక్షుడు జగన్ ఏపీపీఎస్సీ, డీఎస్సీ రెండూ ఒకటే అని అనుకుంటున్నారని మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో జగన్ చేసిన వ్యాఖ్యలపై 'ఎక్స్' వేదికగా లోకేశ్ పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏ పరీక్షలు నిర్వహిస్తుందో..

- మిగతా 2లో



## హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

### హాజరైన సీఎంలు చంద్రబాబు, విజయ్ ,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పెన్ పవర్ డెస్క్: కేంద్రహోంమంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో తమిళనాడులోని మామల్లపురం (మహాబలిపురం)లో దక్షిణ మండలి (సదరన్ కౌన్సిల్) సమావేశం కొనసాగుతోంది. ఈ సమావేశానికి ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం విజయ్, కర్ణాటక

- మిగతా 2లో

## శాసనమండలిలో మంత్రి లోకేశ ప్రవేశపెట్టిన 5 బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం

- శాసనమండలిలో 5 కీలక బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రి లోకేశ్
- విద్యా, గ్రంథాలయ, నైపుణ్య రంగాలకు సంబంధించిన బిల్లులు
- ఆమోదం పొందిన వాటిలో ప్రైవేటు స్కిల్ వర్సిటీల బిల్లు కూడా ఉంది



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో పలు కీలక బిల్లులకు ఆమోదం లభించింది. రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ 5 ముఖ్యమైన బిల్లులను సభలో ప్రవేశపెట్టగా, మండలి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించింది. విద్యా, గ్రంథాలయ, నైపుణ్యాభివృద్ధి రంగాలలో సంస్కరణల లక్ష్యంగా ప్రభుత్వం ఈ బిల్లులను రూపొందించింది.నేడు జరిగిన శాసనమండలి సమావేశంలో మంత్రి లోకేశ్ ఈ బిల్లులను సభ ముందు ఉంచారు. మండలి ఆమోదించిన బిల్లులలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ గ్రంథాలయాల సవరణ బిల్లు-2026,

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### వణుకు పుట్టిస్తున్న వైద్య ఖర్చులు

ఊహించని వైద్య ఖర్చులు తమకు ఒత్తిడిని కలిగిస్తున్నాయని 94 శాతం మంది భావిస్తున్నారని తాజా అధ్యయనంలో తేలింది. భారత్‌లో ఉద్యోగ భద్రత, ప్రపంచ అస్థిరత, జువీ×ల కంటే కూడా పెరుగుతున్న మెడికల్ ఖర్చులే ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నాయని టాటా ఏఐజీకి చెందిన 'ది కార్పొరేట్ హెల్త్ ప్రొటెక్షన్ పల్స్ 2026' అధ్యయనంలో వెల్లడైంది. ఉద్యోగం కోల్పోతే దాదాపు ప్రతి 10 మందిలో ఏడుగురు 6 నెలలు లేదా అంతకంటే తక్కువ కాలం మాత్రమే ఆర్థికంగా నెట్టుకురాగలరు.ప్రొటెక్షన్ గ్యాప్ -- పని చేసే సంస్థ ఇచ్చే బీమాతో పాటు అదనపు ఆరోగ్య బీమా ఉండటం ముఖ్యమని 84 శాతం మంది భావిస్తున్నారు, అయినప్పటికీ దాదాపు సగం మంది ఉద్యోగులు పనిచేసే సంస్థ అందించే గ్రూప్ మెడికల్ కవర్ (జీఎంసీ) కాకుండా వ్యక్తిగత ఆరోగ్య బీమాను కలిగి లేరు. అవగాహన లోపం, తర్వాత కొనుగోలు చేద్దాంలే అనే అలవాటు వ్యక్తిగత ఆరోగ్య బీమాను కొనుగోలు చేయడానికి ప్రధాన అడ్డంకులుగా నిలుస్తున్నాయి. భారత శ్రామిక శక్తిపై ఆరోగ్య సంరక్షణ మోపుతున్న పెరుగుతున్న ఆర్థిక భారాన్ని కూడా ఈ అధ్యయనం తెలిపింది. ఊహించని వైద్య ఖర్చులు తమకు ఆర్థిక ఒత్తిడిని కలిగిస్తున్నాయని ఇందులో పాల్గొన్న దాదాపు 94 శాతం మంది (రెస్పాండెంట్లు) తెలిపారు. ఉద్యోగం కోల్పోవడం లేదా కెరీర్ ఆగిపోవడం కంటే పెద్ద ఆందోళనగా మారింది. ఉద్యోగం లేకుండా ఒక ఏడాది కంటే ఎక్కువ రోజులు తాము ఆర్థికంగా నెట్టుకురాగలమని కేవలం 12% మంది మాత్రమే భావిస్తున్నారు. ఉద్యోగం కోల్పోయినప్పుడు దాదాపు ప్రతి 10 మందిలో ఏడుగురు కేవలం ఆరు నెలలు లేదా అంతకంటే తక్కువ కాలం మాత్రమే ఆర్థికంగా నిలదొక్కుకోగలమని చెప్పారు. దీర్ఘకాలం ఆదాయాన్ని కోల్పోవడాన్ని తట్టుకునేందుకు చాలా మంది కార్పొరేట్ ఉద్యోగులు సిద్ధంగా లేరని ఈ ఫలితాలు వెల్లడించాయి.కుటుంబానికి ఆరోగ్య బీమా, ఆసుపత్రి ఖర్చులు, జీవనశైలి వ్యాధులు, మానసిక ఆరోగ్యం, అత్యవసర పరిస్థితుల కోసం పొదుపు లేకపోవడం వంటివి కార్పొరేట్ భారత్‌లో ప్రధాన 5 ఆరోగ్య సంబంధిత ఆందోళనకర అంశాలుగా నిలిచాయి. ఉద్యోగం మారే సమయంలో ఆదాయం కోల్పోవడం, జువీ×లను మించి వైద్య ఖర్చులే అతిపెద్ద ఆర్థిక ఆందోళన అని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. రెస్పాండెంట్లలో ఉద్యోగం మారే సమయంలో అంతరాయం లేని ఆరోగ్య బీమా కవరేజ్ ముఖ్యం అని 88 శాతం మంది భావిస్తున్నప్పటికీ, మెడికల్ కవరేజీ కొనసాగింపును అందించే సొల్యూషన్స్ కేవలం 40% మందికే తెలుసు. అంటే ఉద్యోగ మార్పు ఈ కీలక దశలో బీమా గురించి అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. "కార్పొరేట్ ఉద్యోగులు పని చేసే సంస్థ అందించే ఆరోగ్య బీమాను ఎలా చూస్తున్నారనేది అర్థం చేసుకోవడం. సన్నద్ధతలో ఇప్పటికీ ఉన్న లోటుపాట్లను గుర్తించడం ఈ అధ్యయనం ఉద్దేశ్యం. ఉద్యోగుల శ్రేయస్సుకు గ్రూప్ మెడికల్ కవర్ ముఖ్యమే అయినప్పటికీ, వైద్య అత్యవసర పరిస్థితి లేదా ఉద్యోగ మార్పు సమయంలో తమ కవరేజ్ ఏ మేరకు ఉంటుందో.. అది సరిపోతుందో లేదో చాలా మందికి క్లారిటీ లేదు. వైద్య ఖర్చులు పెరుగుతున్న కొద్దీ, అవగాహన, ఆర్థిక సన్నద్ధత మరింత ముఖ్యం. ఈ విశ్లేషణలు, ఉద్యోగులు తమ ఆరోగ్య రక్షణ అవసరాలపై సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహిస్తాయి. ఆర్థికంగా నిలకడైన శ్రామిక శక్తిని నిర్మించడానికి యజమానులు, బీమా సంస్థలు, విధానకర్తల మధ్య మెరుగైన సహకారాన్ని పెంపొందిస్తాయని ఆశిస్తున్నట్లు" టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ రీటైల్ - హెల్త్ అండర్‌రైటింగ్ హెడ్ డాక్టర్ సంతోష్ పురి తెలిపారు.ఉద్యోగం చేసే సంస్థ అందించే గ్రూప్ మెడికల్ కవర్ (జీఎంసీ)ని నిశితంగా పరిశీలిస్తే కొన్ని విషయాలు బయటపడతాయి. కంపెనీ అందించే జీఎంసీతో పాటు అదనపు ఆరోగ్య కవరేజ్ కలిగి ఉండాలని 84% మంది నమ్ముతున్నప్పటికీ, యజమాని అందించే కవర్ కాకుండా దాదాపు సగం మంది (45 శాతం) ఎలాంటి అదనపు హెల్త్ ఇన్సూరెన్స్ కలిగి లేరు. అదనపు ఆరోగ్య బీమాను కొనుగోలు చేయడానికి అవగాహన లోపం, తర్వాత పాలసీ తీసుకుందామనే వైఖరి ప్రధాన అడ్డంకిగా ఉన్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా 28-34 సంవత్సరాల వయస్సు గలవారిలో ఇది ఎక్కువగా ఉంది.ఈ అధ్యయనం ద్వారా ఉద్యోగులు తమ గ్రూప్ మెడికల్ కవరేజ్ (జీఎంసీ) పట్ల సంతృప్తిగా ఉన్నప్పటికీ, ఆ కవరేజ్ ఎంతవరకు సరిపోతుందనే దానిపై వారికి నమ్మకం లేదు. అత్యవసర ఆసుపత్రి చేరిక సమయంలో యజమాని అందించే జీఎంసీ ఒక్కటే సరిపోదని దాదాపు 75 శాతం మంది అంగీకరించారు. కంపెనీ అందించే ఆరోగ్య బీమా పరిధి, పరిమితులపై ఉద్యోగుల అవగాహనలో లోపాలను ఈ సర్వే వెలుగులోకి తెచ్చింది. యజమాని అందించే జీఎంసీ అన్ని ఫీచర్లు, ప్రయోజనాల గురించి తమకు పూర్తిగా తెలుసునని కేవలం 41 శాతం మంది ఉద్యోగులు చెప్పారు. ముంబై, హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, పుణే, కోల్‌కతా నగరాల్లో 28-55 సంవత్సరాల వయస్సు గల 748 మందికి పైగా కార్పొరేట్ ఉద్యోగులు ఈ సర్వేలో పాల్గొని తమ అభిప్రాయాలు షేర్ చేసుకున్నారు. అదనపు హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయడానికి కుటుంబ రక్షణే బలమైన ప్రేరణగా నిలుస్తోంది. టాప్-అప్ ప్లాన్‌ను పరిశీలిస్తున్నప్పుడు తాము చూసే అత్యంత ముఖ్యమైన ఫీచర్లుగా ఎక్కువ బీమా మొత్తం, కుటుంబ సభ్యులకు కవరేజ్, ఉద్యోగం మారే సమయంలో కవరేజ్ కొనసాగింపు ఉండాలని కోరుకుంటున్నట్లు రెస్పాండెంట్లు పేర్కొన్నారు.

### కొండా సుస్మిత వ్యాఖ్యలు బాధాకరం..
### పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు

- మొదటి పేజి తరువాయి
2026 ఆగస్టు 20న మాట్లాడిన ఆయన..కొండా సుస్మిత వ్యాఖ్యలు బాధాకరమని అన్నారు. పార్టీలైన్ దాటి ఎవరు మాట్లాడినా చర్యలు తప్పవని హెచ్చరించారు పీసీసీ చీఫ్. సీనియర్ నేత చిన్నారెడ్డి, కొండా సుస్మిత వ్యాఖ్యలు బాధాకరమని.. వారి వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు. వివరణ ఇచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్టీలో అభ్యర్థులను ఎవరు ప్రకటించినా చెల్లదని.. ఎవరికి వారు తామే అభ్యర్థులం అంటూ ప్రకటనలు చేయవద్దని హెచ్చరించారు. పార్టీ లో పాతవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పార్టీలో బీసీలు, మైనార్టీలకు తగిన గుర్తింపు లభిస్తోందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీల నుంచి కొందరు నేతలు రావడంతో కాంగ్రెస్ మరింత బలపడిందన్నారు.

**22 ఏ వల్ల భూదందా, అన్యాక్రాంతానికి అవకాశం ఉండదు:**

22 ఏ పై బి.ఆర్.ఎస్. అనవసర రాద్ధాంతం చేస్తోంది
కింది స్థాయిలో జరిగిన తప్పిదం మా దృష్టికి వచ్చింది
లోపాలను సరిదిద్దాలని అధికారులను సీఎం ఆదేశించారు
తప్పిదం జరిగిందని సాక్ష్యాత్తు మంత్రి ప్రకటించి సరిదిద్దారు.
22 ఏ వల్ల భూదందా, భూముల అన్యాక్రాంతానికి అవకాశం ఉండదు.
మా ప్రభుత్వంలో సామాన్యులకు అన్యాయం జరిగితే గాంధీ భవన్ తలుపులు తట్టవచ్చు.
పోచారం ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆయనతో మాట్లాడాం
ఆయన ఆవేదనను అర్థం చేసుకున్నాం
నామినేటెడ్ పదవుల్లో కాంగ్రెస్ లో సీనియర్ నేతలకు 70 శాతం పదవులు ఇస్తాం
బాన్సువాడ లో పాత కొత్త నేతల కలయికతో ముందుకు వెళ్తాం
పోచారం కాంగ్రెస్ సిద్ధాంతాలకు, సంక్షేమానికి మద్దతుగా ఉన్నారు...
కాంగ్రెస్ తోనే సామాజిక న్యాయం సాధ్యం..

# గ్రూప్-1పై విచారణకు మేము రెడీ..
# డీఎస్సీపై సీబీఐ విచారణకు మీరు సిద్ధమా?

- మొదటి పేజి తరువాయి
కోవిడ్ కారణంగా మూల్యాంకనం ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో ఏపీపీఎస్సీ కమిషన్ డిజిటల్ మూల్యాంకనానికి నిర్ణయం తీసుకుందని, అయితే దీనిపై కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారని జగన్ వివరించారు. నోటిఫికేషన్‌లో పేర్కొననందున, హైకోర్టు ఆదేశాల మేరకు డిజిటల్ మూల్యాంకనాన్ని పూర్తిగా పక్కనపెట్టి, మాన్యువల్ పద్ధతిలోనే జవాబు పత్రాలను దిద్దామని స్పష్టం చేశారు. ఆ మార్కుల ఆధారంగానే 163 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చామని, ఈ ప్రక్రియ మొత్తం హైకోర్టు పర్యవేక్షణలోనే జరిగిందని తెలిపారు. ఇప్పుడు సంబంధం లేని డిజిటల్ మూల్యాంకనంపై ఆరోపణలు చేయడం కేవలం ఉద్యోగుల జీవితాలతో ఆడుకోవడమేనని విమర్శించారు.
గ్రూప్-1 మూల్యాంకనం హాయ్‌ల్యాండ్‌లో జరిగిందంటూ చేస్తున్న ప్రచారాన్ని జగన్ తీవ్రంగా ఖండించారు. అక్కడ ఎలాంటి మూల్యాంకనం జరగలేదని, ఈ విషయాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నియమించిన సిట్ కూడా హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో
పేర్కొందని గుర్తుచేశారు. తమపై బురద జల్లేందుకు దర్యాప్తు బృందాలను వాడుకోవడం చంద్రబాబుకు అలవాటేనని ఆరోపించారు. నాలుగేళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న వారిపై విషం కక్కుతూ, వారి భవిష్యత్తును నాశనం చేయాలని చూడటం సరికాదని జగన్ హితవు పలికారు. ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా చివరకు నిజమే గెలుస్తుందని ఆయన అన్నారు.

## దక్షిణాది రాష్ట్రాలు ఏకతాటిపైకి రావాలి..
## మన మధ్య బలమైన సహకారం అవసరం

డ్రగ్స్ రవాణాపై ఉమ్మడి పోరాటం, ఆర్థిక కారిడార్ల నిర్మాణం, బ్లూ ఎకానమీ విస్తరణ, దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణ కోసం అన్ని రాష్ట్రాలు సహకారంతో ముందుకు సాగాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పిలుపునిచ్చారు. మహాబలిపురంలో 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. దేశ జీడీపీలో 30 శాతానికి పైగా వాటా కలిగిన దక్షిణాది రాష్ట్రాలు తయారీ, ఎగుమతులు, సేవల రంగాల్లో కేంద్రంగా నిలుస్తున్నాయని ఆయన గుర్తుచేశారు.

**ఆర్థిక కూటమిగా ఎదగాలి**

తయారీ జోన్లు, లాజిస్టిక్స్ పార్కులు, ఫ్రైట్ కారిడార్ల ద్వారా దక్షిణ ప్రాంతం ఒక సమీకృత ఆర్థిక కూటమిగా పనిచేయాలని సీఎం విజయ్ ఆకాంక్షించారు. బెంగళూరులోని బొమ్మసంద్ర నుంచి హోసూర్ వరకు మెట్రో రైలు విస్తరణను స్వాగతించిన ఆయన, ఇది అంతర్రాష్ట్ర సహకారానికి ఒక నమూనా అని అభివర్ణించారు. ఈ పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు.'డ్రగ్స్ రహిత దక్షిణ భారతం' కోసం మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా సమాచారాన్ని పంచుకుంటూ, కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలపై నియంత్రణ, అనధికార పంపిణీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**సముద్ర తీరంతో అభివృద్ధి**

దక్షిణాది అభివృద్ధిలో బ్లూ ఎకానమీకి ప్రాధాన్యత ఇవ్వాలని విజయ్ అన్నారు. 1,076 కిలోమీటర్ల తీరప్రాంతం ఉన్న తమిళనాడు.. పోర్టులు, తీరప్రాంత నౌకాయానం, మత్స్య పరిశ్రమ, సముద్ర ఆధారిత పరిశ్రమలు, పర్యాటకం వంటి రంగాల్లో ఇతర రాష్ట్రాలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఆర్థిక సమాఖ్య విధానంపై మాట్లాడుతూ.. రాబోయే ఫైనాన్స్ కమిషన్ నిధుల కేటాయింపులో రాష్ట్రాల అవసరాలు, పనితీరు రెండింటినీ పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. జనాభా నియంత్రణలో విజయవంతమైన రాష్ట్రాలకు నష్టం జరగకూడదని, జీఎస్టీ తర్వాత పన్ను రేట్లను నిర్ణయించుకునే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉండాలని అన్నారు.

**నీట్, నదీ జలాలపై స్పష్టమైన వైఖరి**

అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల్లో కోర్టు తీర్పులు, ట్రిబ్యునల్ అవార్డులను అమలు చేయడం ద్వారా దిగువ రాష్ట్రాల హక్కులను కాపాడాలని విజయ్ డిమాండ్ చేశారు. కావేరీ జలాల విషయంలో
ఆదేశాలను సకాలంలో అమలు చేయాలని, ముల్లపెరియార్ డ్యామ్ భద్రత, నీటి నిల్వను 152 అడుగులకు పెంచే అంశం న్యాయస్థానాల నిర్ణయాల మేరకే జరగాలని స్పష్టం చేశారు. నీట్ పరీక్షపై తమిళనాడు వ్యతిరేకతను పునరుద్ఘాటించిన ఆయన.. ఇది గ్రామీణ, పేద విద్యార్థులకు నష్టం చేస్తుండటంతో రాష్ట్ర కోటాలోని మెడికల్, డెంటల్, ఆయుష్ సీట్లను 12వ తరగతి మార్కుల ఆధారంగా భర్తీ చేసేందుకు అనుమతించాలని కేంద్రాన్ని కోరారు.
జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన కారణంగా డీలిమిటేషన్ ప్రక్రియలో ఏ రాష్ట్రం కూడా పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని కోల్పోకుండా చట్టపరమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. "బలమైన రాష్ట్రాలతోనే దేశం బలోపేతమవుతుంది. విభేదాలను చర్చలు, పరస్పర గౌరవం, చట్ట పాలన ద్వారా పరిష్కరించుకోవడానికి తమిళనాడు సిద్ధంగా ఉంది" అని ఆయన చెప్పుకొచ్చారు.

# ప్రతిపక్షాలు గెలవవు..
# అధికార పక్షాలే ఓడిపోతాయి..

- మొదటి పేజి తరువాయి
ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో దశాబ్దకాలంగా సాగుతున్న ఫాసిస్టు పాలనకు అంతం దగ్గరపడుతోందంటూ ప్రకాశ్ రాజ్ అన్నారు. అడవిలో ఓ క్రూరమృగం సంచరిస్తున్నప్పుడు మిగతా జంతువులు ఎలా అప్రమత్తం అవుతాయో.. నేటి యువత కూడా దేశాన్ని పట్టిపీడిస్తున్న 'రాజకీయ మృగాన్ని' అలాగే పసిగట్టిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడేం భయపడటం లేదు.. మీ రాజకీయాలు మాకు అర్థమయ్యాయి అని యువత ప్రధాని నరేంద్ర మోదీకి చెప్పిందని ప్రకాశ్ రాజ్ పేర్కొన్నారు.
చీజుజు వివాదం కేవలం పరీక్షా వ్యవస్థలోని లోపాల సమస్య కాదని, ఇది దేశ యువత భవిష్యత్తు, వారి అవకాశాలు, న్యాయంపై నమ్మకానికి సంబంధించిన అంశంగా ప్రకాశ్ రాజ్ అభివర్ణించారు. గతంలో రైతులు, కార్మికులు, ఉద్యోగులు ఉద్యమించినా.. ఉద్యోగాలు, భూములు, జీవనాధారం కోల్పోతామనే భయాలు వారిని వెనక్కి లాగాయని అన్నారు. కానీ యువతకు 'కోల్పోవడానికి ఏమీ లేదు' అంటూ వారి పోరాట స్ఫూర్తిని ప్రశంసించారు.జంతర్‌మంతర్‌లో భారీగా జరిగిన నిరసనలను గుర్తుచేసిన ఆయన.. యువత పార్లమెంట్ వైపు కదలాలని ప్రయత్నించడం దేశ రాజకీయ వ్యవస్థనే కుదిపేసిందన్నారు. ముఖ్యంగా హింసకు దూరంగా ఉండి ప్రశ్నలు అడగడమే యువత బలం అని చెప్పారు. అయితే బీజేపీని ఓడించడం ఒక్కటే పరిష్కారం కాదని ప్రకాశ్ రాజ్ స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు గెలవవు.. అధికార పక్షాలే ఓడిపోతాయి అంటూ సంచలన వ్యాఖ్య చేశారు. ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిని ఎంచుకునేంత రాజకీయ చైతన్యం యువతలో రావాలని పిలుపునిచ్చారు. ఇది ఒక ఎన్నిక కోసం చేసే పోరాటం కాదు.. న్యాయం, మెరుగైన సమాజం కోసం జీవితాంతం సాగించే ప్రయాణం అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

### మూడు రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ ట్రైన్ కారిడార్..
## సీఎం చంద్రబాబు కీలక ప్రతిపాదన

- మొదటి పేజి తరువాయి
చంద్రబాబు వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలు ఊపందుకుంటాయని, ఇది దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఇదే సమావేశంలో, దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు చంద్రబాబు మరో ముఖ్యమైన సూచన చేశారు. దక్షిణాదిలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శ్రీశైలం, కాంచీపురం, మధురై, రామేశ్వరం వంటి వాటిని.. ఉత్తర భారతదేశంలోని వారణాసి, అయోధ్య, చార్‌ధామ్ వంటి ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధానిస్తూ ప్రత్యేక వారసత్వ, పర్యాటక, తీర్థ యాత్ర సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇది దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు పర్యాటక రంగానికి కొత్త ఊపునిస్తుందని తెలిపారు.2047 నాటికి భారత్‌ను 30-35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపాలన్న జాతీయ లక్ష్యంలో దక్షిణాది రాష్ట్రాలు ప్రధాన భూమిక పోషిస్తాయని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం దేశ జీడీపీలో దక్షిణాది ఐదు రాష్ట్రాల వాటా 31 శాతంగా ఉందని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ 2.4 ట్రిలియన్ డాలర్లు, తమిళనాడు 2.6 ట్రిలియన్ డాలర్లు, కర్ణాటక 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలుగా ఎదిగే లక్ష్యాలు నిర్దేశించుకున్నాయని, తద్వారా దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదుగుతాయని ఆయన వివరించారు. ఈ లక్ష్యాల సాధనకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.

## మోదీ, అమిత్ షాల రాజకీయ అధ్యాయం ముగిసింది

- మొదటి పేజి తరువాయి
ప్రయాణం ముగిసిపోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.కేంద్రంలో బీజేపీకి స్వతంత్రంగా మెజారిటీ లేకపోవడం వల్ల ఆ పార్టీ రాజకీయ శక్తి, పట్టు పూర్తిగా తగ్గిపోయాయని ఆయన విమర్శించారు. గతంలో చూపిన రాజకీయ ఆధిపత్యాన్ని మోదీ, అమిత్ షా జోడీ ఇప్పుడు కోల్పోయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ, 'ఇండియా' కూటమి మరింత వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలపై పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని, రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## జగన్ ఏపీపీఎస్సీ, డీఎస్సీ ఒకటే అనుకుంటున్నారు

- మొదటి పేజి తరువాయి
ఆ విధి విధానాలేంటో కనీసం తెలియని జగన్ తన పాలనా కాలంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేకపోయారన్నారు. ఇప్పుడు అసెంబ్లీలో చర్చకు రాకుండా పారిపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ ఒకటే అనేవిధంగా జగన్ చేసిన వ్యాఖ్యల వీడియోను ఈ సందర్భంగా లోకేశ్ పోస్ట్ చేశారు.

## శాసనమండలిలో మంత్రి లోకేశ్ ప్రవేశపెట్టిన 5 బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం

- మొదటి పేజి తరువాయి
ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సవరణ బిల్లు ఉన్నాయి. వీటితో పాటు ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాసంస్థల (ఉపాధ్యాయుల కేడర్ లో రిజర్వేషన్) సవరణ బిల్లులను కూడా సభ ఆమోదించింది. రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన ఏపీ ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ బిల్లుకు కూడా మండలి ఆమోదముద్ర వేసింది. ఈ బిల్లులకు సభ్యులందరూ మద్దతు తెలపడంతో ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు ప్రకటించారు.

## హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

- మొదటి పేజి తరువాయి
సీఎం డీకే శివకుమార్, కేరళ సీఎం సతీశన్, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మిగిలిన ముఖ్యమంత్రులు కలుసుకున్నారు.
దీనికి సంబంధించిన ఫొటోలను ఏపీ సీఎం కార్యాలయం 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించిన కీలక అంశాలు, కేటాయింపులు, ఇతర అంశాలపై చర్చించారు. ప్రధానంగా నీట్ వివాదం, కావేరి జలాలు, నియోజకవర్గాల పునర్విభజనపై తమ అభ్యంతరాలను దక్షిణాది రాష్ట్రాల సీఎంలు అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు.

## సోనియా గాంధీ ఆత్మకథ.. రాహుల్ భావోద్వేగ పోస్ట్

- మొదటి పేజి తరువాయి
భావోద్వేగానికి గురయ్యారు. "అమ్మా.. నిన్ను నాన్ననూ కలిసి చివరిసారి చూసి 35 ఏళ్లకు పైగా దాటింది. నాన్న వెళ్లిపోయినప్పటి నుంచి ప్రతి సవాల్‌ను నువ్వు ఎంతో ధైర్యం, గౌరవంతో ఎదుర్కొన్నావు. నువ్వు ఎదుర్కొన్న కష్టాలు ఏంటో ప్రియాంకకు, నాకు మాత్రమే తెలుసు" అని రాహుల్ ఎక్స్‌లో భావోద్వేగపూరితంగా రాసుకొచ్చారు. తన తల్లి ఆత్మకథను లక్షల మంది చదవబోతున్నందుకు గర్వంగా ఉందన్నారు. వ్యక్తిగత జీవితాన్ని ఎప్పుడూ బహిరంగంగా చెప్పేందుకు ఇష్టపడని ఆమెకు.. ఈ కథను ప్రపంచంతో పంచుకోవడం ఎంత కష్టమో తనకు తెలుసన్నారు. గురువారం రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా "పాపా తన అందమైన సోనియాను చూసి గర్వంగా నవ్వుతూ ఉండొచ్చు" అని రాహుల్ పేర్కొన్నారు.సోనియా తన జీవిత ప్రయాణంపై రాసిన ఆత్మకథను నాఫ్ ప్రచురణ సంస్థ నవంబరు 10న హార్డ్‌కవర్, ఈ-బుక్ రూపంలో విడుదల చేయనుంది. దీని ఆడియో ఎడిషన్‌ను పెంగ్విన్ రాండమ్ హౌస్ అందుబాటులోకి తీసుకురానుంది. తొలి ముద్రణలో లక్ష కాపీలను ముద్రించనున్నట్లు ప్రచురణకర్త తెలిపారు. మరోవైపు తన జీవితంలో జరిగిన కీలక ఘట్టాలు, విషయాలను పుస్తకంలో పంచుకున్నట్లు సోనియా తెలిపారు. ఇందులో రాజీవ్ గాంధీతో ప్రేమ, పెళ్లి వంటి విషయాలను పేర్కొన్నట్లు వెల్లడించారు. రాజకీయాల్లోకి రావడం, అందుకు దారితీసిన పరిస్థితులను పంచుకున్నట్లు ఆమె వివరించారు. తన కుటుంబం గురించే ఎక్కువగా ప్రస్తావించినట్లు తెలిపారు. ఇంకా ఎన్నో అంశాలను ఆమె అందులో పంచుకున్నారు. 'నా జీవితాన్ని రాయడం అంత సులభంగా అనిపించలేదు. లోపలే దాచుకున్న అనుభవాలను బయటపెట్టాల్సి వచ్చింది" అని సోనియా తెలిపారు.

## ట్రంప్‌ది 'ఆర్థిక ఉగ్రవాదం'.. ఓటమి తప్పదు

- మొదటి పేజి తరువాయి
ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, సార్వభౌమాధికారానికి ముప్పు కలిగిస్తుందని ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. అమెరికా (ఖూూ) అప్పులు 40 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నాయనే సూచించే మీడియా నివేదికలను ఆయన ప్రస్తావించారు. ఆర్థిక క్రమశిక్షణను పునరుద్ధరిస్తానని అధ్యక్షుడు ట్రంప్ (ఐశీఖ్రీస ుతీబఎజూ) హామీ ఇచ్చినప్పటికీ.. ఆయన అనుసరించిన అనేక విధానాలు రుణ భారాన్ని మరింత పెంచాయని అవి పేర్కొన్నాయి.

**హర్మూజ్‌లో అమెరికా రహస్య షిప్పింగ్ కారిడార్**

ఇరాన్ (×తీఱఅ)ను ఆర్థికంగా దెబ్బతీయడమే లక్ష్యంగా ట్రంప్ కీలక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఇరాన్‌కు సాయం చేసే దేశాలు ఆర్థికంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇరాన్ ముప్పును ఎదుర్కోడానికి, దాన్ని ఏకాకిని చేసి, ఓడించడానికి మిత్రదేశాలన్నీ తమతో కలిసి నిలబడాలని పిలుపునిచ్చారు. ఆ దేశం ఎప్పటికీ అణ్వాయుధం కలిగి ఉండకూడదని 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ పెట్టారు.

# బీసీ హాస్టల్ బాలుడి అదృశ్యం కేసు సుఖాంతం



**కరప, పెన్ పవర్,ఆగస్టు 20 :** కరప మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బుర్రా అవినాష్ గురువారం ఉదయం హాస్టల్ నుంచి ఆకస్మాత్తుగా అదృశ్యమయ్యాడు. దీంతో కంగారుపడిన పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అతని పేరెంట్స్‌కు సమాచారం అందించి అనంతరం కరప పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. వెంటనే స్పందించిన పోలీసులు బాలుడి ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పెద్దాపురం మండలం దివిలి గ్రామానికి చెందిన అవినాష్ అదృశ్యమైన కొన్ని గంటలకు పిఠాపురం మండలం విరవ గ్రామంలోని చిన్నమ్మ ఇంటికి చేరినట్లు గుర్తించారు. ఎస్ఐ తోట సునీత, హెచ్‌సీ గంగాధర్, సిబ్బంది బాలుడిని కరప స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలను గడువులోగా పూర్తి చేయాలి





**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 20:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026లో భాగంగా చేపడుతున్న వివిధ ప్రక్రియలను నిర్ణీత గడువులోగా, అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఏడు నియోజకవర్గాల ఈఆర్వోలను ఆదేశించారు.గురువారం అమరావతి నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియల పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 31,695 నోటీసులకు గాను ప్రస్తుతం 1,305 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని గురువారం సాయంత్రానికి పూర్తి చేస్తామని తెలిపారు. ఇప్పటివరకు చేపట్టిన 2,973 విచారణల్లో 90 శాతం ప్రక్రియ పూర్తయిందని, పత్రాల సమర్పణలో జాప్యం కారణంగా పెండింగ్‌లో ఉన్న మిగిలిన కేసులను కూడా త్వరగా పరిష్కరిస్తామని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వివరించారు.

కొత్త ఓటర్ల నమోదు,వివరాల సవరణకు సంబంధించి ఫారం--6లో 8,396, ఫారం--8లో 5,386 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో నిర్ణీత షెడ్యూల్‌లోగా పరిష్కరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బుక్ ఆఫ్ కాల్‌లో పెండింగ్‌లో ఉన్న ఆరు అంశాలు,ఎన్జీఎస్‌టీకి సంబంధించిన ఐదు ఫిర్యాదుల పరిష్కారానికి అవసరమైన స్పష్టత వచ్చిందని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులోగా అన్ని ప్రక్రియలను పూర్తి చేస్తామని పేర్కొన్నారు.అనంతరం ఈఆర్వోలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రక్రియలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.నోటీసుల జారీ, అందజేత,క్షేత్రస్థాయి పరిశీలనలో సేకరించిన సమాచారం ఆధారంగా అవసరమైన నోటీసులను సంబంధిత వ్యక్తులకు సకాలంలో అందించే విధానంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దాఖలైన వినతులు, అభ్యంతరాలపై విచారణ ప్రక్రియ నాణ్యతతో,పారదర్శకంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.ఫారం--6, 7, 8 దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆగస్టు 22, 23, 29, 30 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న ప్రత్యేక ప్రచార దినాలను అన్ని పోలింగ్ కేంద్రాల్లో విజయవంతం చేసి అర్హులందరూ ఓటు హక్కు పొందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఓటర్ల సందేహాలు, సమస్యలను బీఎల్‌ఓలతో నేరుగా మాట్లాడి పరిష్కరించుకునేందుకు ఉద్దేశించిన 'బుక్ ఏ కాల్ విత్ బి ఎల్ ఓ వినతులను ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ ద్వారా అందుతున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు కాకినాడ జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--2026 పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో డాక్టర్ డి. తిప్పే నాయక్, ఈఆర్వోలు, జగ్గంపేట ఈఆర్వో ఎన్.వి.వి. సత్యనారాయణ, పెద్దాపురం ఈఆర్వో పి.కృష్ణమూర్తి, పిఠాపురం ఈఆర్వో భారతి, కాకినాడ సిటీ ఈఆర్వో కేటీ సుధాకర్, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



# కల్తీ పై నిరంతరణ ఏది.. ఆరోగ్యానికి భద్రత ఎక్కడ?

### నిబంధనలకు విరుద్ధంగా ధాబా నిర్వహకులు....

### అన్నవరం రా.......డు ధాబాలో కల్తీ ఆహారం..

### ప్రజల ప్రాణాలతో చెలగాటమా...

**శంఖవరం పెన్ పవర్ ఆగస్టు 20:-** రుచికరమైన ఆహారం పై మొక్కువతో అలవాటు పడిన భోజన ప్రియలు ప్రతి రోజు దగ్గరలో గల ధాబాలను ఆశ్రయించడం జరుగుతుంది. ఇదే అలుసుగా తీసుకుని దాబా నిర్వాహకులు ప్రజలు ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయ కుండా లాభార్జనే ధ్యేయంగా వ్యాపారాన్ని కొనసాగు తున్నారు. దీనిలో భాగంగానే కాకినాడ జిల్లా శంఖవరం మండలం లో అన్నవరం గ్రామ శివారున గల రా..... డు ధాబా ఇటీవల కాలంలో భోజన ప్రియులను ఆకర్షించడానికి, మరింత రుచి కల్పించడానికి ఆహార పదార్థాలపై రసాయనిక రంగులను కలుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ప్రజలు దాబా పై మక్కువ చూపించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అసలు ఈ దాబాకు తగిన అనుమతులు ఉన్నాయా లేదా అని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక ధాబాను నిర్వహించా లంటే పంచాయతీ అధికారి నుండి, లేబర్ ఇన్స్పెక్టర్ అధికారి నుండి, అగ్నిమాపక అధికారుల నుండి, పొల్యూషన్ అధికారం నుండి, ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి నుండి అనుమతులు పొందవలసి ఉంటాది కానీ అవేవీ ఇక్కడ కనిపించవు ఇక్కడ నిర్వహించే దాబా పరిస్థితిని చూస్తే అనుమతులకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని ప్రజల ఆరోపిస్తున్నారు.కల్తీ ఆయిల్, నిల్వ ఉంచిన మాంస పదార్థాలు, కల్తీ రసాయనాలు వాడడడం వలన భోజన ప్రియులు అనేక అరోగ్య సమస్యలకు గురి అవుతూ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా డాబాల నిర్వాహకుల పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించ వలసిందిగా కోరుతున్నారు.

# కలెక్టర్, ఎస్పీకి కుమ్మర శాలివాహన సంఘం మెమోరాండం...

### ఆత్మహత్య కేసుపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్...





**శంకవరం పెన్ పవర్ ఆగస్టు 20:-** కాకినాడ టిల్ల పూడి నూకరాజు కుటుంబ సభ్యుల ఆత్మహత్యపై తగిన విచారణ జరిపి సాబిద్ ఖాన్ అనే వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా కుమ్మర శాలివాహన సంఘం డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్షులు టిల్ల పూడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈరోజు జిల్లా కలెక్టర్ హరేంద్రప్రసాద్ మరియు జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ లకు మెమోరాండం అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, స్పందిస్తూ ఇప్పటికే ఈ కేసును చాలా సీరియస్ గా తీసుకున్నామని, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని తెలిపారు. ఎస్పీ బిందు మాధవ్, మాట్లాడుతూ ఇప్పటికే ఐదు టీములు పనిచేస్తున్నాయని, త్వరలోనే సాబిద్ ఖాన్ ను అదుపులోకి తీసుకుని కోర్టు ముందు హాజరుపరుస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్ భీమా బత్తుల సత్యనారాయణ, సెక్రటరీ నారాయణరావు, ట్రెజరర్ సుబ్బారావు, ఆకేటి రాంబాబు, వైస్ ప్రెసిడెంట్, వైస్ సెక్రటరీలు టిల్ల పూడి విశ్వనాథం, కాకినాడ జగన్నాథపురం శాలివాహన పెద్దలు, జిల్లా శాలివాహన పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేట శ్రీ ప్రజ్ఞలో రైతుల వేషధారణలతో సంబరాలు



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 20:** స్థానిక శ్రీ ప్రజ్ఞ పాఠశాలలో చిన్నారులను రైతుల వేషధారణలతో వివిధ వ్యవసాయ క్షేత్రాల సందర్శనకు తీసుకు వెళ్లినట్లు విద్యా సంస్థల చైర్మన్ బండారు నాగబాబు తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పంట పండించే రైతు దేశానికి వెన్నెముక అని, చిననాటి నుండి పిల్లలకు నాట్లు వేసే విధానం, పంటలు పండించే విధానాలను చిన్నారులకు పరిచయం చేయడం జరుగుతుందన్నారు. విద్యతో పాటు క్షేత్ర స్థాయి అంశాలపై ప్రత్యక్షంగా చిన్నారులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని నాగబాబు తెలిపారు. రైతు కుటుంబ వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తుమ్మల శ్వేత, ప్రిన్సిపాల్ కె.అభి, ఇంచార్జ్ కొల్లా శ్రీనివాస్, పులిగ పవన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇర్రెగ్యులర్ నంబర్ ప్లేట్లపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్







**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 20:** ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా, నిర్దేశిత ప్రమాణాలు పాటించకుండా అమర్చిన ఇర్రెగ్యులర్ నంబర్ ప్లేట్లు కలిగిన వాహనాలపై కాకినాడ ట్రాఫిక్-2 పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 110 వాహనాలను గుర్తించి మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం జరిమానాలు విధించారు.కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు,అదనపు ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో ట్రాఫిక్-2 పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.రామారావు, ఎస్సైలు, సిబ్బంది గురువారం కాకినాడ పట్టణంలోని ట్రాఫిక్-2 పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నంబర్ ప్లేట్లను అక్కడికక్కడే తొలగించి, మోటార్ వెహికల్ యాక్ట్ నిబంధనలకు అనుగుణంగా నిర్దేశిత ప్రమాణాలు కలిగిన కొత్త నంబర్ ప్లేట్లను వాహనాలకు అమర్చించారు. విధించిన జరిమానాలను కూడా వాహనదారులతో అక్కడికక్కడే చెల్లింపజేశారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ ఎం.కిషోర్ కుమార్ వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించి,ఇర్రెగ్యులర్ నంబర్ ప్లేట్ల వల్ల కలిగే సమస్యలపై అవగాహన కల్పించారు.నంబర్ ప్లేట్లపై అక్షరాలు, సంఖ్యలను మార్చడం, వక్రీకరించడం, ఫ్యాన్సీ ఫాంట్లు ఉపయోగించడం, వ్యక్తిగత పేర్లు,హోదాలు లేదా ఇతర సందేశాలతో స్టిక్కర్లు అతికించడం చట్టవిరుద్ధమని తెలిపారు.నంబర్ ప్లేట్ స్పష్టంగా,దూరం నుంచే చదవగలిగేలా ఉండాలని సూచించారు.ఇర్రెగ్యులర్ లేదా నకిలీ నంబర్ ప్లేట్లు హిట్ అండ్ రన్ కేసులు,వాహన దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాల్లో వాహనాలను గుర్తించడం కష్టతరం చేసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.ప్రతి సందర్భంలో ఇవే నేరాలకు ప్రత్యక్ష కారణం కాకపోయినా,వాహన గుర్తింపును దాచేందుకు లేదా నేరాల అనంతరం వాహనాన్ని ట్రేస్ చేయడం కష్టతరం చేసేందుకు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందన్నారు.ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమశిక్షణ, వాహనాల సులభ గుర్తింపు కోసం ప్రతి వాహనదారుడు తన వాహన నంబర్ ప్లేట్ నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో స్వయంగా పరిశీలించుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-2 పోలీస్ స్టేషన్ ఎస్సైలు బి. రాజేష్ కుమార్, ఎం.ఎస్.ఎన్. రాజు, ఏ. సత్యనారాయణ,పి. సత్యనారాయణతో పాటు ట్రాఫిక్-2 సిబ్బంది పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఆదిత్య యూనివర్సిటీలో బీటెక్ తొలి ఏడాది తరగతులు ప్రారంభం

**తల్లిదండ్రులు--విద్యార్థులకు దిశానిర్దేశం.. రికార్డు స్థాయి ప్లేస్‌మెంట్లపై యాజమాన్యం వెల్లడి**






**గండేపల్లి, పెన్ పవర్ , ఆగస్టు 20** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో 2026--27 విద్యా సంవత్సరానికి బీటెక్ మొదటి సంవత్సరం తరగతులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆగస్టు 19న సీఎస్ఈ, ఏఐఎంఎల్, డేటా సైన్స్ విభాగాల తరగతులు ప్రారంభం కాగా, ఆగస్టు 20న ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్‌తో పాటు బిజినెస్ మేనేజ్‌మెంట్, ఫోరెన్సిక్ తరగతులను ప్రారంభించినట్లు ఆదిత్య డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్‌రెడ్డి హాజరయ్యారు. విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆదిత్య యూనివర్సిటీని ఎంపిక చేసుకుని తమ సంస్థపై నమ్మకం ఉంచిన తల్లిదండ్రులకు శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ వరకు ఉన్న విద్యా విధానానికి, టెక్నికల్ విద్యా విధానానికి ఎంతో వ్యత్యాసం ఉంటుందని, ఈ దశలో విద్యార్థులు తమకు ఏది కావాలో తెలుసుకోలేని అయోమయ స్థితిలో ఉండే అవకాశం ఉందన్నారు. అందువల్ల తల్లిదండ్రులు పిల్లలకు సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. తరచూ యూనివర్సిటీకి వచ్చి అధ్యాపకులతో పరస్పరం చర్చిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు సహకరించాలని కోరారు.

**నాలుగేళ్లు.. నాలుగు తరాల భవిష్యత్తు**

విద్యార్థులు తమ నాలుగేళ్ల విద్యాభ్యాసాన్ని కేవలం డిగ్రీ కోసం కాకుండా, భవిష్యత్తును నిర్మించుకునే కీలక దశగా గుర్తించాలని డా. సతీష్‌రెడ్డి సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని, శ్రమను గుర్తించి మంచి సత్ప్రవర్తనతో ఉన్నత ఉద్యోగాలు సాధించి వారి కలలకు ప్రతిరూపాలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

**రూ.1.06 కోట్ల వార్షిక వేతనంతో రికార్డు ప్లేస్‌మెంట్**

ఆదిత్య విద్యార్థులు ప్లేస్‌మెంట్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని డా. సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఇద్దరు విద్యార్థులు రికార్డు స్థాయిలో రూ.1.06 కోట్ల వార్షిక వేతనంతో ఉద్యోగాలు పొందడం విశేషమన్నారు. గత రెండు సంవత్సరాలుగా 95 శాతానికి పైగా ఆదిత్య విద్యార్థులు వివిధ ప్రముఖ కంపెనీల్లో అత్యుత్తమ వార్షిక వేతనాలతో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ప్రత్యేక ప్లేస్‌మెంట్ శిక్షణ, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ ఇందుకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు.

డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి తరగతికి తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. యూనివర్సిటీ నియమ నిబంధనలు పాటిస్తూ ల్యాబ్, లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలని, అధ్యాపకులు బోధించిన అంశాలను ఎప్పటికప్పుడు అవగాహన చేసుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు.

వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు తమ కర్తవ్యాలను తెలుసుకుని, సమయపాలన పాటిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రో వైస్ ఛాన్సలర్ డా. తంగజం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని, దాని సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సలర్లు డా. ఆదిరెడ్డి రమేష్, డా. ఎస్. రమాశ్రీ, విలాస్ అనిల్ చవాన్, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

## స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు

- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై మాజీ జడ్పీటీసీ నులుకుర్తి హర్షం



**కరప, పెన్ పవర్ న్యూస్, ఆగస్టు 20:** రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని టీడీపీ కాకినాడ రూరల్ సీనియర్ నేత, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు.

కరపలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీల సంక్షేమం, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్లకు కృతజ్ఞతలు తెలిపారు.


రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, 34 శాతం రిజర్వేషన్లతో బీసీ వర్గాలకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు లభిస్తాయని అన్నారు. అనంతరం నాయకులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

కార్యక్రమంలో దేవు వెంకటేశ్వరరావు, చాట్ర ఇమ్మానుయేలు, కొండా వినాయక్, గుబ్బల ప్రసాద్ రావు, కట్టా వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడిలో పిల్లలు ఏరి?

- ఉపాధ్యాయులు ఫుల్ విద్యార్థులు నిల్!
- ఐదవ తరగతి వరకు నామమాత్రపు విద్యార్థులతో పాఠశాలలు నిర్వహణలు
- ప్రైవేట్ పాఠశాలల వైపు తల్లిదండ్రుల మొగ్గు
- వచ్చిన కొద్దిమంది విద్యార్థులతోనే కాలక్షేపం
- ప్రైవేట్ పాఠశాలల్లో... ఎల్కేజీ, యూకేజీ నిర్వహణలతో , అంగన్వాడి, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కరువు





**గండేపల్లి, పెన్ పవర్ ఆగస్టు 20** ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. గండేపల్లి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు లేక వెలవెలబోతుండటం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కలిపి ముగ్గురు, ఏడుగురు చొప్పున మాత్రమే విద్యార్థులు ఉండగా, వారికి బోధించేందుకు ఉపాధ్యాయులు మాత్రం అందుబాటులో ఉంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన, మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతోంది. అయినప్పటికీ ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరగకపోవడం ప్రశ్నార్థకంగా మారింది.

గండేపల్లి మండలంలో మొత్తం 41 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 31 ప్రాథమిక పాఠశాలలు, 2 యూపీ పాఠశాలలు, 8 జడ్పీహెచ్ఎస్ ఉన్నాయి. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు కనిపిస్తోంది.

ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తేనే మెరుగైన విద్య, మంచి భవిష్యత్తు ఉంటుందనే భావనతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కనిష్ట స్థాయికి చేరుతోంది.


**పిల్లలు లేని బడులు.. ఏం ప్రయోజనం?**

ప్రభుత్వం విద్యపై భారీగా నిధులు వెచ్చిస్తూ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నా, విద్యార్థులు లేకపోతే ఆ ప్రయత్నాల ఫలితం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఉపాధ్యాయులు ఉన్నా విద్యార్థులు లేకపోవడం.. బడులు ఉన్నా బాట పట్టని పిల్లలు ఉండటం ప్రభుత్వ విద్యా వ్యవస్థకు సవాలుగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఈ పరిస్థితి ఐ సి డి ఎస్ అంగన్వాడి సెంట్రల్ పై పడిందని చెప్పాలి . మూడు సంవత్సరముల నిండిన పిల్లలను అంగన్వాడి సెంటర్లకు పంపే తల్లిదండ్రులు రెండు నిండకుండానే ఎల్కేజీ యూకేజీ అంటూ ప్రైవేట్ పాఠశాలలకు పంపించడం వలన అంగన్వాడీ సెంటర్లలో సైతం పిల్లలు కనరాని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి పోవాలంటే ఎల్కేజీ యూకేజీ పేర్లతో బడీయుడు రాకుండానే పిల్లలను ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం రాకపోతుందని దానిని నిరోధించిన నాడే ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ సెంటర్లు, లక్ష్యాలు చేరుతాయి అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా పిల్లల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలపై మోజు చూపడంతో ప్రభుత్వం నిర్వహించే పాఠశాలలు, అంగన్వాడి సెంటర్లు అంతంత మాత్రంగా విద్యార్థులతో దర్శనం ఇవ్వడం గమనార్హం. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వం నుండి విద్యార్థులకు అందిస్తున్న తల్లికి వందనం పేరుతో విడుదల చేస్తున్న 15 వేల రూపాయలను ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే అని ప్రభుత్వం ప్రకటించిన రోజున పూర్తిస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు నిండుకుంటాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మండల విద్యాశాఖ అధికారి నాయక్ వివరణ: ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయిలో విద్యార్థులు లేకపోవటానికి ముఖ్య కారణం విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలో ఎల్కేజీ యూకేజీ నుండి చేర్పించడం జరుగుతుంది అందువలన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కరువుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిర్వహించడం జరుగుతున్న విద్యార్థులు తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గుచూపడం ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్వాడి సెంటర్లకు లక్ష్యాలను చేరుకోవడం లేదు. మొత్తం మండలంలో 41 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. అయినప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలపై మొగ్గు చూపడం విశేషం.

## 47వ జాబ్ మేళాలో 18 మందికి ఉద్యోగాలు




**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 20:** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో నిర్వహిస్తున్న వారాంతపు జాబ్ మేళాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రామచంద్రపురం ఉపాధి భవన్‌లో నిర్వహించిన 47వ జాబ్ మేళాలో 18 మంది అభ్యర్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇంటర్వ్యూల అనంతరం డిక్సన్ కంపెనీలో 15 మంది,నియో లింక్ కంపెనీలో ముగ్గురు ఎంపికయ్యారు. కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం నియామక పత్రాలు అందజేసి అభినందించారు. జాబ్ మేళాలను విజయవంతంగా నిర్వహిస్తున్న రామ్‌కుమార్, హెచ్ఆర్ శ్రీనివాస్‌ను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు మంత్రి వాసంశెట్టి సుభాష్ మార్గదర్శకత్వంలో ఇప్పటివరకు 47 జాబ్ మేళాలు నిర్వహించినట్లు తెలిపారు. యువతకు నిరంతరం ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళాలను కొనసాగిస్తామని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి యువకుడు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు తమకు అవకాశం కల్పించిన మంత్రి వాసంశెట్టి సుభాష్, వాసంశెట్టి సత్యం, ఉపాధి భవన్ అధినేత రామ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉండవల్లి శివ,క్లస్టర్-2 ఇన్‌చార్జి కంచుమర్తి బాబురావు, కో-క్లస్టర్ ఇన్‌చార్జి ఏలూరి యేసుదాసు తదితరులు పాల్గొన్నారు.

## నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలి



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 20:** పిఠాపురం పంచాయతీరాజ్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న టిల్లపూడి నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలని కాకినాడ జిల్లా శాలివాహన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. నూకరాజు కుటుంబం మరణానికి కారణ మయ్యారని ఆరోపిస్తున్న షేక్ సాదిక్ ఖాన్‌ను అరెస్టు చేసి, సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులతో పాటు బీజేపీ నాయకులు యేనిమిరెడ్డి రెడ్డి మాలకొండయ్య, మానేపల్లి అయ్యాజీ వేమా, టీడీపీ మైనార్టీ నేత ఎం.డి. అన్సర్ మాట్లాడుతూ.. నూకరాజు కుటుంబానికి జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సాదిక్ ఖాన్ వెనుక ఎవరైనా ఉన్నట్లయితే వారిని కూడా గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేసులో పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. ఒక వ్యక్తి చేసిన తప్పును మొత్తం ముస్లిం సమాజానికి ఆపాదించరాదని, నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం ద్వారా సామాజిక సామరస్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. నూకరాజు కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘం నాయకులు టిల్లపూడి నాగేశ్వరరావు, బి.సత్యనారాయణ,యు.
నారాయణరావు,కే.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులు, బీసీల సంక్షేమమే లక్ష్యం



**కాకినాడ రూరల్ పెన్ పవర్, ఆగస్టు 20:** మత్స్యకారులు,బీసీ వర్గాల సంక్షేమం, ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి,మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి,సత్యనారాయణమూర్తి దంపతులు తెలిపారు. గురువారం 3వ డివిజన్‌లో నిర్వహించిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా శాంతనపూరి కాలనీ,వాడపేట,పల్లిపేట, ముగ్గపేట,బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో వారు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మత్స్యకార కుటుంబాల జీవన పరిస్థితులు, ఉపాధి, రహదారులు, డ్రైనేజీ,తాగునీరు, పారిశుద్ధ్యం,వీధి దీపాలు,యువతకు ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై ప్రజల నుంచి వివరాలు సేకరించారు. బీసీ వర్గాల ప్రజలతో ఆత్మీయంగా మమేకమై వారి సంక్షేమం,విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం,సామాజిక సాధికారతకు టీడీపీ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు మెరుగైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో మరిన్ని అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. తమ ఎమ్మెల్యే హయాంలో ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులను పలువురు స్థానికులు గుర్తుచేసుకుంటూ, ప్రస్తుతం అవసరమైన మౌలిక వసతుల గురించి పిల్లి దంపతులకు వివరించారు. ప్రజలు తెలిపిన సమస్యలను నమోదు చేసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సామాజిక భద్రతా పథకాలు, యువతకు ఉపాధి అవకాశాలు తదితర కూటమి ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రెండేళ్ల పాలనకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి కార్యాలయాల్లో కూర్చుని ఎదురు చూడకుండా,గడప వద్దకే వెళ్లి వారి మాట వినడమే 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం ఉద్దేశమని పిల్లి దంపతులు తెలిపారు. మత్స్యకారులు,బీసీలు అధికంగా నివసించే ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ జడ్పీటీసీ నూలుకుర్తి వెంకటేశ్వరరావు, 3వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గుత్తుల రమేష్,రాయుడు సుబ్బారావు, సత్య వినయ్,రాము,బాబీ,తేజ,నూకరాజు తదితర టీడీపీ నాయకులు,క్లస్టర్, బూత్ కన్వీనర్లు,డివిజన్ కమిటీ నాయకులు, బీసీ నాయకులు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు,కూటమి శ్రేణులు, మహిళలు,యువత, స్థానికులు పాల్గొన్నారు.


## బీసీ హాస్టల్ బాలుడి అదృశ్యం కేసు సుఖాంతం

**కరప, పెన్ పవర్,ఆగస్టు 20 :** కరప మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బుర్రా అవినాష్ గురువారం ఉదయం హాస్టల్ నుంచి ఆకస్మాత్తుగా అదృశ్యమయ్యాడు. దీంతో కంగారుపడిన పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అతని పేరెంట్స్‌కు సమాచారం అందించి అనంతరం కరప పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. వెంటనే స్పందించిన పోలీసులు బాలుడి ఆచూకీ కోసం అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పెద్దాపురం మండలం దివిలి గ్రామానికి చెందిన అవినాష్ అదృశ్యమైన కొన్ని గంటలకు పిఠాపురం మండలం విరవ గ్రామంలోని చిన్నమ్మ ఇంటికి చేరినట్లు గుర్తించారు. ఎస్ఐ తోట సునీత, హెచ్‌సీ గంగాధర్, సిబ్బంది బాలుడిని కరప స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు వన్ స్టాప్ పోర్టల్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 20:** రాష్ట్రంలోని అన్ని రకాల వాణిజ్య, పారిశ్రామిక యూనిట్లకు ఒకే చోట పరిష్కారాలు అందించే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'వన్ స్టాప్ పోర్టల్'ను అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.ఈ పోర్టల్‌లో ఐదు నిమిషాల కంటే తక్కువ సమయంలో నమోదు చేసుకోవడం ద్వారా జిల్లాలోని పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు తమకు ఎదురవుతున్న సమస్యలు,వివిధ విజ్ఞప్తులను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు.అలాగే సంస్థల్లో చేపడుతున్న ఉద్యోగ నియామకాల వివరాలను నమోదు చేయడంతో పాటు, ప్రస్తుతం లేదా భవిష్యత్తులో వివిధ హోదాల్లో అవసరమయ్యే ఉద్యోగుల వివరాలను కూడా ప్రభుత్వానికి తెలియజేయవచ్చని తెలిపారు. జిల్లాలోని అన్ని పరిశ్రమలు,వాణిజ్య సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వన్ స్టాప్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.సంస్థలకు సంబంధించిన సమస్యలు,విజ్ఞప్తులు, ప్రస్తుత, భవిష్యత్ ఉద్యోగ నియామకాల అవసరాల వివరాలను పోర్టల్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు.పోర్టల్‌లో నమోదు ప్రక్రియకు సంబంధించి సందేహాలు లేదా ఇబ్బందులు ఎదురైతే జిల్లా పరిశ్రమల కేంద్రాన్ని నేరుగా సంప్రదించవచ్చని, లేదా 9394540044 మొబైల్ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని పరిశ్రమలు, వాణిజ్య సంస్థల సమస్యలను పరిష్కరించడం,వారి విజ్ఞప్తులను పరిశీలించడం,అవసరమైన సహకారం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.




## ఈ నెల 22న కాకినాడ రూరల్‌లో 'వన్ మంత్--వన్ విలేజ్--ఫోర్ విజిట్స్'



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 20:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు చేపట్టిన 'వన్ మంత్--వన్ విలేజ్--ఫోర్ విజిట్స్' కార్యక్రమాన్ని ఈ నెల 22వ తేదీన కాకినాడ రూరల్ మండలం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమం ఈ నెల 21న ప్రభుత్వ సెలవు కారణంగా శుక్రవారానికి బదులుగా శనివారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు, డివిజన్, మండల స్థాయి అధికారులు గమనించాలని సూచించారు.రమణయ్యపేటలోని కాకినాడ రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 22న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి నేరుగా ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలని కోరారు.డివిజన్, మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు శనివారం ఉదయం 9.30 గంటలకే కాకినాడ రూరల్ ఎంపీడీవో కార్యాలయానికి విధిగా చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు 20:**స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద జయంతి వేడుకలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మేటి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు విచ్చేసి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భారతదేశానికి కంప్యూటర్ టెక్నాలజీని తీసుకొచ్చింది రాజీవ్ గాంధీ అని, ఇలాంటి ఎన్నో సంక్షేమ పథకాలు రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి చేశారని అన్నారు. చిన్న వయస్సులోనే రాజీవ్ గాంధీ భారతదేశం ప్రధానిగా యువతకు ఉద్యోగ అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞానంలో తగిన విప్లవాత్మక మైన మార్పులను తెచ్చి భారతదేశమును ఇప్పటికీ అభివృద్ధి చెందే విధముగా చేసిన ఘనత స్వర్గీయ రాజీవ్ గాంధీకే దక్కుతుందని అని ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమములో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు మాచవరపు శివన్నారాయణ, ములపర్తి మోహన్ రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఇస్మాయిల్ షరీఫ్, ఆదుర్తి నారాయణమూర్తి, మహమ్మద్ హబీబ్, ములపర్తి శ్యామలరావు, మహిళా నాయకురాలు కొల్లు సరోజిని తదితరులు పాల్గొన్నారు.

## 'నెట్ జీరో హెల్త్ క్యాంపస్' కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలి







**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 20:** జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యార్థులకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించే లక్ష్యంతో చేపట్టిన 'నెట్ జీరో హెల్త్ క్యాంపస్' ప్రాజెక్టును పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారి సంతృప్తి స్థాయిని పెంచేందుకు ప్రత్యేకంగా కృషి చేయాలని సూచించారు.గురువారం కాకినాడ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ, స్టీ,బీసీ,విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖలు, గురుకుల పాఠశాలలు,పంచాయతీ, డ్వామా తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా 'నెట్ జీరో హెల్త్ క్యాంపస్' ప్రాజెక్టు అమలు తీరు,మొక్కల పెంపకం,సోప్ కిట్ల ఏర్పాటు,పారిశుద్ధ్య నిర్వహణ, మధ్యాహ్న భోజనం,వసతి గృహాల్లో చేపట్టిన మరమ్మతులు,పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ తదితర అంశాలను వసతి గృహాల వారీగా సమీక్షించారు.కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నెట్ జీరో ప్రాజెక్టులో భాగంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన మొక్కల పెంపకం కార్యక్రమాన్ని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో తొలి దశలో 19 సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టును సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా విద్యుత్, నీటి వనరులతో పాటు ఇతర నిర్వహణ వ్యయాలను తగ్గించవచ్చని, విద్యార్థులకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన,ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.వసతి గృహాలు, విద్యా సంస్థల ప్రాంగణాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, ఇందుకోసం వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. సోప్ కిట్ల ఏర్పాటు,ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన,రుచికరమైన భోజనం అందించాలని,స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు.వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు,సేవలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారి సంతృప్తి స్థాయిని పెంచేందుకు అధికారులు ప్రత్యేక కృషి చేయాలన్నారు.వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సమావేశంలో జిల్లా విద్యాధికారి పి. రమేష్, బీసీ సంక్షేమ అధికారి ఎ. శ్యామల కుమారి,డ్వామా పీడీ ఎస్. మధుసూదన్,డీపీవో వి.రవికుమార్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ ఏవై శ్రీనివాసరావు, గురుకుల పాఠశాల జిల్లా సమన్వయకర్త రాజకుమారి,నెట్ జీరో హెల్తీ క్యాంపస్ ప్రాజెక్టు జిల్లా సమన్వయకర్త కె. వీరబాబు,సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ సర్వసభ్య సమావేశం

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 20:** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.వి.వి.వి.ఎస్. లక్ష్మణరావు తెలిపారు.కాకినాడలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని తెలిపారు.సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఆయన సూచించారు.

## విద్యార్థుల భద్రతపై పోలీసుల అవగాహన సదస్సు





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 20:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆదేశాల తో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఉత్తర్వుల ప్రకారం రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్. విద్యాసాగర్ ఆత్రేయపురం ఎస్ఐ ఎస్. రాము ఆధ్వర్యంలో అంకంపాలెం గ్రామంలోని శివ శివాని ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులతో అనుసంధాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థుల భద్రత, మహిళలు బాలల రక్షణకు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. ముఖ్యంగా పోక్సో చట్టం, మాదకద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ మోసాలు, మహిళలు బాలికల భద్రత తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు.మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ శక్తి యాప్ వినియోగించే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. అలాగే మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణలో అప్రమత్తతే కీలకమని పోలీసు అధికారులు తెలిపారు.విద్యార్థినీ, విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఎదురైతే రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్. విద్యాసాగర్ 9440796527 నంబర్‌లో నేరుగా ఫోన్ చేసి సంప్రదించవచ్చని తెలిపారు.విద్యార్థుల భద్రతకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి-ఏపీఆర్డీసీ డైరెక్టర్ వెన్నా శివ....

### ఎమ్మెల్యే సత్యప్రభ సూచనలతో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్ల పంపిణీ....

**శంఖవరం పెన్ పవర్ ఆగష్టు 20:-**విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివి వాటిని సాధించాలని రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ అన్నారు. కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచనలతో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లలో భాగంగా విద్యార్థులకు బుక్స్,యూనిఫాంలు, షూస్, బ్యాగులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వెన్నా శివ మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమని, చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో శంఖవరం మండల జనసేన అధ్యక్షుడు గాబు సుభాష్, కత్తిపూడి సొసైటీ చైర్మన్ గాబు కృష్ణమూర్తి, జిల్లా టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు కంచిబోయిన శ్రీను,కత్తిపూడి టీడీపీ అధ్యక్షుడు కేలంగి జన, ఏఎంసీ డైరెక్టర్ నాయుడు సూరిబాబు, గాబు




శివ,కీర్తికుమార్,కందా గోవిందు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పాఠశాల అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షల నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి





**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 20:** గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ,వెల్లడింపు, లింగ నిర్ధారణ కోసం పరీక్షలు నిర్వహించడం చట్టవిరుద్ధమని,ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.గర్భస్థ పిండ జన్యుపరమైన లోపాలు,క్రోమోజోమ్ సమస్యలను గుర్తించేందుకు మాత్రమే అల్ట్రాస్కానింగ్ సాంకేతికతను వినియోగించాలని,దుర్వినియోగానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ,జిల్లా సలహా కమిటీ సమావేశం కలెక్టర్,కమిటీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో చట్టం అమలు తీరు,స్కానింగ్ కేంద్రాల నమోదు, తనిఖీలు, ఉల్లంఘనలపై తీసుకున్న చర్యలను కమిటీ సభ్యులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భ్రూణహత్యలను అరికట్టడంతో పాటు జిల్లాలో స్త్రీ, పురుష నిష్పత్తిలో సమతుల్యత సాధించేందుకు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం--1994ను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 20 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు. ఆడపిల్లల నిష్పత్తి తక్కువగా నమోదవుతున్న ఆరోగ్య కేంద్రాల పరిధిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిస్తూ లింగ సమానత్వాన్ని ప్రోత్సహించాలని సూచించారు.ఆరోగ్య కేంద్రాల్లో జన్మించే శిశువుల్లో జన్యుపరమైన లేదా ఇతర జనన లోపాలు ఉన్న వారి వివరాలను పక్కాగా రికార్డు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీలు వైద్య నిబంధనలకు విరుద్ధంగా మందులు వినియోగిస్తూ ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించకుండా వారి కార్యకలాపాలను నియంత్రించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు.ఈ విషయంలో ఎన్జీవోల సహకారంతో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.భ్రూణ లింగ నిర్ధారణకు పాల్పడే వైద్యులు, సిబ్బంది,స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులతో పాటు ప్రోత్సహించే, సహకరించే,మధ్యవర్తిత్వం వహించే వ్యక్తులపైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో చట్టపరమైన నిబంధనలు,రికార్డుల నిర్వహణ, పరీక్షల వివరాలు,సంబంధిత ఫారాల నిర్వహణ తదితర అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.తనిఖీల్లో గుర్తించిన లోపాలను నమోదు చేసి నిర్దేశిత కాలవ్యవధిలో చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో స్త్రీ,పురుష నిష్పత్తిని నిరంతరం పర్యవేక్షిస్తూ బాలికల పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించేలా ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.ప్రభుత్వ,ప్రైవేటు వైద్య సంస్థలు,స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అక్రమ లింగ నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే స్పందించి, వాస్తవాలను నిర్ధారించేందుకు డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని, అవసరమైన తనిఖీలు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకునేలా రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భ్రూణహత్యలను పూర్తిగా అరికట్టి బాలికల జననానికి అనుకూలమైన సామాజిక వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు."ఆడపిల్లను కాపాడుదాం.. సృష్టిని రక్షిద్దాం" అనే భావనతో అధికారులు, వైద్య వర్గాలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.కమిటీ సభ్యుల అనుమతితో రెండు అల్ట్రాస్కానింగ్ కేంద్రాలకు కొత్తగా అనుమతులు మంజూరు చేయడంతో పాటు తొమ్మిది అల్ట్రాస్కానింగ్ కేంద్రాల రెన్యువల్‌కు, 11 కేంద్రాల్లో మార్పులు,చేర్పులకు ఆమోదం తెలిపారు.సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.అనిత,డీఐఓ డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డాక్టర్ అమల,పెద్దాపురం డీఐఓ ఎన్.ప్రశాంతి,ఎన్జీవో యాళ్ల పద్మలత,పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.నాగబాబు,హెచ్ఈఓ సూర్యచంద్రరావు, జిల్లా స్థాయి కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తామరాడలో ఘనంగా అయ్యప్పస్వామి నాలుగవ వార్షికోత్సవ వేడుకలు.





**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు, 20:**కిర్లంపూడి మండలం తామరాడ గ్రామంలో ఏలానదీ తీరాన వేంచేసి ఉన్న అయ్యప్ప స్వామి ఆలయం వద్ద స్వామివారి నాలుగవ వార్షికోత్సవ వేడుకలు ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి వేకువ జాము నుండి అభిషేకాలు, విశేష పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సహాయసహకారాలతో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.తామరాడ, గోనేడ,రామచంద్రపురం, పాలెం చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన అధిక భక్తులు సంఖ్యలో తరలివచ్చి అయ్యప్ప స్వామివారిని దర్శించుకుని. అన్న ప్రసాదములు స్వీకరించారు.ు

## బీసీలకు రాజకీయ సాధికారత కు 34 రిజర్వేషన్ కల్పించడం చరిత్రాత్మకం

- రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు గంగాధరరావు



**అంబాజీపేట,పెన్ పవర్, ఆగష్టు 20** రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం బీసీలకు రాజకీయ సాధికారత కు

34 రిజర్వేషన్ కల్పించడం చరిత్రాత్మకం అని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు గంగాధరరావు( పెదబాబు) స్పష్టం చేశారు. గురువారం అంబాజీపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ నాయకులు తో పాటు ఇతర ఉపకులాల నాయకులు పాల్గొని హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన 33.33% రిజర్వేషన్ తో రాష్ట్రంలో 16,800 బీసీలు స్థానిక సంస్థలలో ప్రాతినిధ్య వహించే అవకాశం కలుగుతుందన్నారు. గత వైసిపి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ ను 24 శాతానికి తగ్గించి అన్యాయానికి గురిచేసిందని గుర్తు చేశారు. అయినా అప్పటి బీసీ నాయకులు ప్రశ్నించకపోవడం సిగ్గుచేటు అన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కు అభినందనలు తెలిపారు. మండల జనసేన అధ్యక్షులు దొమ్మేటి సాయి కృష్ణ మాట్లాడుతూ బీసీల పక్షపాతి అయిన కూటమి ప్రభుత్వానికి స్థానిక సంస్థలలో అత్యధిక స్థానాలలో గెలుపు ఇచ్చి అభిమానాన్ని చాటుకుంటామన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు జరిగిన అన్యాయాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు కురస ఆంజనేయులు, తెలుగు యువత అధ్యక్షులు జోగి కృష్ణ చైతన్య, మండల బిజెపి ఉపాధ్యక్షులు అయ్యగారి శ్రీనివాస్, నాయకులు దొమ్మేటి వెంకట రామారావు, దొమ్మేటి శ్యాం, మట్టపర్తి శ్రీవెంకటేశ్వరరావు, గుత్తుల సురేష్ కుమార్, ఓరుగంటి వెంకట్రావు, అధికారపు బాబ్జి, నేదునూరి కళ్యాణ్, కాగితాపల్లి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు విధిగా పంట బీమా నమోదు చేసుకోవాలి.





- ఏలూరు పొలం బడి కార్యక్రమంలో ఎఓ, జోకా

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఆగస్టు, 20:**ప్రత్తిపాడు మండలంలోని ఏలూరు గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి జోకా ఆధ్వర్యంలో గురువారం 'పొలంబడి' కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రతి గురువారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి జోకా అమృత పాల్గొని రైతులకు వరి పంట యాజమాన్య పద్ధతులపై పలు సలహాలు సూచనలు అందజేశారు.14 వారాల పాటు నిర్వహించే పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ, జోకా అమృత తెలిపారు.వరి పంటను ఆశించే పురుగులు,తెగుళ్ల నివారణకు సకాలంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.పంటకు మేలు చేసే మిత్ర పురుగులను సంరక్షించడం ద్వారా రసాయన పురుగుమందుల వినియోగాన్ని,పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవచ్చన్నారు.మితిమీరిన ఎరువుల వినియోగాన్ని తగ్గించి శాస్త్రీయ సాగు పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు.ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు,పంట నష్టాలు సంభవించే అవకాశం ఉన్నందున వరి సాగు చేస్తున్న ప్రతి రైతు పంట బీమా నమోదు చేసుకోవాలని కోరారు.ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఎకరానికి రూ.760 చెల్లించి పంటను బీమా పరిధిలోకి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు వరహాలు,గ్రామ పెద్దలు,స్థానిక రైతులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ లెజిస్లేటర్ పార్టీ సమావేశంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు 20:**జనసేన పార్టీ లెజిస్లేటర్ పార్టీ సమావేశం ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, జనసైనికుల పాత్ర తదితర కీలక అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసైనికుల పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని నిర్ణయించారు.

## కత్తిపూడిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి




- ఎమ్మెల్యే సత్యప్రభ...
- కాకినాడకు తరలించే పరిస్థితి లేకుండా కత్తిపూడిలో వైద్య సదుపాయం కల్పించాలి....
- గిరిజన ప్రాంతాలకు అంబులెన్స్ సేవలు బలోపేతం చేయాలి...
- అసెంబ్లీలో ఆరోగ్యశాఖ మంత్రిని కోరిన ఎమ్మెల్యే సత్యప్రభ

**శంఖవరం పెన్ పవర్ ఆగష్టు 20:-** అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నియోజకవర్గ వైద్య సమస్యలను ప్రస్తావించారు.జాతీయ రహదారి ఆనుకుని ఉన్న కత్తిపూడి పరిసర ప్రాంతాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగు తున్నందున అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రమాదాల్లో గాయపడిన వారిని ప్రాథమిక చికిత్స కోసం సైతం కాకినాడకు తరలించాల్సి వస్తుండటంతో విలువైన సమయం వృథా అవుతోందని,కత్తిపూడిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రిని కోరారు.ప్రత్తిపాడు నియోజకవర్గంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత తీవ్రంగా ఉందని,ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను తక్షణమే భర్తీ చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.నియోజకవర్గంలో గిరిజన గ్రామాలు అధికంగా ఉన్నందున మారుమూల ప్రాంతాల ప్రజలకు అత్యవసర వైద్యం సకాలంలో అందేందుకు అంబులెన్స్ సౌకర్యాలను బలోపేతం చేయాలని కోరారు.అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందక గిరిజన ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సకాలంలో చికిత్స అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సత్యప్రభ కోరారు.

## మాదకద్రవ్యాలపై ఈగల్ పల్లెబాట యువత దూరంగా ఉండాలి.. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

**సమాచారం ఉంటే 1972కు ఫోన్ చేయండి**




**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు, 20** గండేపల్లి మండలం సుబ్బయ్యమ్మపేట, మల్లేపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఈగల్ పల్లెబాట కార్యక్రమంలో భాగంగా వి.బి.జి. రాంజీ శ్రామికులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తులు, కుటుంబాలు, సమాజంపై కలిగే తీవ్ర దుష్పరిణామాలను ఈగల్ సిబ్బంది వివరించారు. ముఖ్యంగా యువత గంజాయి, మత్తు పదార్థాలు, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వారిని చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి మంచి మార్గంలో నడిపించాలని కోరారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

కార్యక్రమంలో వి.బి.జి. రాంజీ శ్రామికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఈగల్ సిబ్బంది సూర్య చక్ర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# బొత్స అనూష పొలిటికల్ ఎంట్రీ...

**విజయనగర్, ఆగస్టు 20, పెన్ పవర్:** మాజీ మంత్రి, వైసీపీ నేతబొత్స సత్యనారాయణ కుమార్తె అనూష రాజకీయ రంగ ప్రవేశంపై క్లారిటీ వచ్చింది. బుధవారం రోజు మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా తన వారసురాలి రాజకీయ రంగ ప్రవేశంపై బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్య లు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కుమార్తె అనూష పోటీ చేస్తుందని బొత్స సత్యనారాయణ వెల్లడించారు. విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికల్లో అనూషను బరిలోకి దింపనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ఏ పద్ధతిలో జరిగినా, పోటీ చేయడం పక్కానని క్లారిటీ ఇచ్చారు. దీంతో బొత్స కుటుంబం నుంచి మరో తరం పొలిటికల్ ఎంట్రీకి ముహూర్తం ఖరారైందని రాజకీయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.మరోవైపు బొత్స అనూష వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ఇప్పటికే అడపాదడపా రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొంటూ.. పొలిటికల్ ఎంట్రీకి సిద్ధమవుతున్నారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికి అనూష బరిలోకి దిగుతూ ఉండటంతో విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికలు ఈసారి మరింత ఆసక్తికరంగా మారాయి. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు, మరీ ముఖ్యంగా ఉత్తరాంధ్ర పాలిటిక్స్‌లో బొత్స కుటుంబం సుమారు నాలుగు దశాబ్దాలుగా కీలక పాత్ర పోషిస్తోంది. 1978లో విద్యార్థి నేతగా బొత్స సత్యనారాయణ రాజకీయ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత విజయనగరం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు అయ్యారు. 1999లో కాంగ్రెస్ తరుపున బొబ్బిలి ఎంపీ అయ్యారు. ఆ తర్వాత చీపురుపల్లి అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన బొత్స సత్యనారాయణ.. వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గాల్లో పనిచేశారు. ఏపీసీసీ అధ్యక్షుడిగానూ వ్యవహరించారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత వైసీపీలో చేరిన బొత్స.. జగన్ మంత్రివర్గంలోనూ పనిచేశారు. బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీ కూడా రాజకీయాల్లో రాణించారు. రెండుసార్లు విజయనగరం జెడ్పీ ఛైర్ పర్సన్‌గా, ఓసారి విజయనగరం ఎంపీగా వ్యవహరించారు. బొత్స సత్యనారాయణ సోదరుడు బొత్స అప్పలనరసయ్య 2019 ఎన్నికల్లో గజపతినగరం నుంచి వైసీపీ తరుపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పుడు బొత్స కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వస్తున్న నాలుగో వ్యక్తిగా బొత్స అనూష నిలవనున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## దసరాలో లోకల్ సందడి

**విశాఖపట్టణం, ఆగస్టు20, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో భారీ ఎన్నికల సమరానికి తెరలేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అత్యంత వేగంగా అడుగులు వేస్తోంది. బీసీ రిజర్వేషన్ల సమగ్ర అధ్యయనం కోసం వేసిన డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చింది. అయితే ఆ నివేదికలో సిఫారసు చేసిన దాని కన్నా ఎక్కువగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరోవైపు సెప్టెంబర్ మొదటి వారంలోనే వార్డుల వారీగా తుది ఫొటో ఓటర్ల జాబితాలను ప్రచురించాలని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా ఆదేశించడంతో కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. అంతా అనుకున్నట్లు సాగితే సెప్టెంబర్ చివరి వారం నుంచి అక్టోబర్ నెలల మధ్యలో ఏపీ అంతటా స్థానిక ఎన్నికల హడావుడి రావడం ఖాయంగా కనిపిస్తోందిఈసారి ఎన్నికల నిర్వహణలో అత్యంత ఆసక్తికరమైన అంశం ఓటర్ల జాబితా ఎంపిక. ఓటర్ల జాబితా సవరణ సుదీర్ఘ ప్రక్రియ వల్ల ఎన్నికల నిర్వహణ ఆలస్యం కాకుండా ఉండేందుకు 2025 నాటి స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రాతిపదికన ఎన్నికలకు వెళ్లాలని ఎస్ఈసీ వ్యూహాత్మకంగా నిర్ణయించింది. పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ, సవరణలతో పాటు ఇప్పటికే బీసీ డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ను మించి దాదాపు 34% వరకు బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ సాంకేతిక, పరిపాలనా ముందడుగులు పరిశీలిస్తే ఎన్నికలను మళ్లీ వాయిదా వేసే ఉద్దేశంలో ప్రభుత్వం లేదని స్పష్టమవుతోంది.కూటమి ప్రభుత్వానికి ఈ స్థానిక ఎన్నికలు తమ రెండు సంవత్సరాల పరిపాలనా పనితీరుకు, ప్రజాదరణకు మొదటి అధికారిక టెస్ట్ లాంటివి . సాధారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన భారీ విజయం తర్వాత వచ్చే స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూల వేవ్ ఉండటం సహజం. మరోవైపు, పరాజయం నుంచి బయటపడే ప్రయత్నం చేస్తున్న వైఎస్సార్ సీపీకి ఈ స్థానిక సమరం ఊపిరి పీల్చుకునే అత్యంత కీలకమైన వేదిక. ప్రతిపక్ష హోదా కూడా దక్కని స్థితిలో ఉన్న వైసీపీ, స్థానిక సంస్థల ద్వారా క్షేత్రస్థాయి క్యాడర్‌లో మళ్లీ ఉత్సాహం నింపాలని భావిస్తోంది. గత ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో ఉన్న స్థానిక ప్రజాప్రతినిధుల బలంతో పాటు,వైసీపీ శ్రేణులు కనీసం వార్డు, పంచాయతీ స్థాయిలో పట్టు నిలుపుకోగలిగితే పార్టీకి కొత్త పునాది లభిస్తుంది. అందువల్లే, ప్రభుత్వం ఎంత వేగంగా ఎన్నికలకు వెళ్లినా వైసీపీ కూడా వెనకడుగు వేయకుండా పోరుకు సిద్ధమవుతోంది.ఎన్నికల వ్యూహాల పరంగా చూస్తే.. స్థానిక పోరులో పార్టీ గుర్తుపై జరిగే మున్సిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ పోల్స్ ఒకెత్తయితే, పార్టీ గుర్తులేని ఎన్నికలు మరొకెత్తు. పంచాయతీ ఎన్నికల్లో గ్రామాల్లో ఉండే పాత కక్షలు, వర్గపోరు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ రకమైన రాజకీయ సమీకరణాల్లో అధికార కూటమి మధ్య సీట్ల సర్దుబాటు కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య సమన్వయ పరీక్షగా మారే ప్రమాదం కూడా ఉంది. దీన్ని వైకాపా తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేసే అవకాశం లేకపోలేదు. సెప్టెంబర్, అక్టోబర్ నెలలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పూర్తి రాజకీయ వేడిని నింపబోతున్నాయి. పొలిటికల్ అట్మాస్ఫియర్ అంతా గ్రామ సర్పంచ్ నుండి మున్సిపల్ ఛైర్మన్ల దాకా ఆశావాహుల హడావుడితో మారబోతోంది. ఒకవైపు ప్రభుత్వం తన ఆధిపత్యాన్ని దిగువ స్థాయి దాకా విస్తరించాలని భావిస్తుంటే, మరోవైపు ఉనికి చాటుకోవడానికి వైసీపీ పోరాడుతోంది. కాబట్టి రాబోయే రెండు నెలలు ఏపీ వ్యాప్తంగా సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యల చుట్టూ తిరిగే ఓట్ల పోరాటం అత్యంత ఉత్కంఠభరితంగా సాగడం ఖాయం.=

## వెనక్కి వచ్చేస్తున్న గుంటూరు మిర్చి

**గుంటూరు, ఆగస్టు 20, పెన్ పవర్:** మన గుంటూరు మిర్చి విదేశాల్లో ఉన్న గిరాకీని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే, అదంతా అప్పుడు.. ఇప్పుడు విదేశాలకు వెళ్లిన మన మిర్చి తిరిగి వెనక్కి వచ్చేస్తోంది. దానికి అసలైన కారణం రసాయనాలు ఎక్కువగా వాడటం. పురుగుమందు అవశేషాలు ఎక్కువగా ఉండటంతో చైనా, శ్రీలంక వంటి దేశాలు మన మిర్చి ఉన్న కంటైనర్లను తిరిగి పంపించేసింది. ఇలాంటి సమయంలో రైతులు పాటించాల్సిన కొన్ని సూచనలను లాంఫాం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సేఫ్ కెమికల్స్ వాడితే విదేశాల్లో డిమాండ్ వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.గుంటూరు మిర్చికి ఉన్న డిమాండ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒకప్పుడు ఈ మిర్చి కోసం విదేశీయులు కూడా పోటీపడేవారు. అయితే, ఇటీవల కాలంలో గుంటూరు మిర్చి ఏ దేశానికి వెళ్లిన తిరిగి మనకే వస్తుంది. దానికి అసలైన కారణం రసాయనాలు వాడటం. రసాయన అవశేషాలు.. అఫ్లాటాక్సిన్.. తేమశాతం ఎక్కువగా ఉందన్న కాలరణాలతో మిర్చిని తిరస్కరిస్తున్నాయి. ఇటీవల చైనా, శ్రీలంక దేశాలు మిరప కంటైనర్లను వెనక్కి తిరిగి పంపించాయి. ఇంకొన్ని దేశాలయితే ఆంక్షలు విధిస్తున్నాయి. ఇలాంటి సమయంలో మిర్చికి మంచి డిమాండ్ రావాలంటే లాంఫాం శాస్త్రవేత్తలు కొన్ని సూచనలు అందజేస్తున్నారు.ప్రస్తుతం మిర్చికి చీడపీడలు ఎక్కువగా పడుతుండటంతో రసాయనాలు వాడాలని రైతులు అంటున్నారు. అయితే, రసాయనాలు వాడకుండా కూడా మిర్చికి మంచి దిగుబడి తీసుకురావొచ్చని నిపుణులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని సూచిస్తున్నారు. మిరపకు సోకే పురుగులు, తెగుళ్ల వ్యాప్తిని తొలి దశలోనే గుర్తించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని చెబుతున్నారు.లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాల ఏర్పాటుతో పాటు పంటలో అక్కడక్కడ బంతి, ఆముదం మొక్కలను ఎర పంటలుగా వేయాలని చెబుతున్నారు. ఒకవేళ రసాయనాలు వాడాల్సి వస్తే సేఫ్ కెమికల్స్ చల్లుకోవాలని సూచించారు. కాయలు కోయడానికి 25 రోజుల ముందుగా మాత్రమే రసాయనాలు చల్లాలని, దీని వల్ల పంటలో రసాయన అవశేషాల ప్రభావం చాలా వరకు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.పంట కోతకి వచ్చినప్పుడు పూర్తిగా కాయ పండిన తర్వాతే కోసి ఆరబెట్టాలని, అప్పుడు మాత్రమే అమ్మకానికి సిద్ధం చేసుకోవాలని చెప్పారు. కోల్డ్ స్టోరేజ్‌ల్లో నిల్వ చేసేటప్పుడు కాయలను బాగా ఎండేలా చూడాలంటూ లాంఫామ్ శాస్త్రవేత్తలు వివరించారు.మన దగ్గర పండే మిరప సుమారు 30 శాతానికి పైగా ఎగుమతి అవుతుంది. చైనా, బంగ్లాదేశ్, శ్రీలంక, సింగపూర్, మలేషియాతో పాటు మిడిల్ ఈస్ట్ ప్రాంతాల్లో మన మిరపకు మంచి డిమాండ్. ఈ దేశాలన్నీ తమకు దిగుమతి అయ్యే పంటలో రసాయనాలు తక్కువగా ఉండేలా ఆహార ప్రమాణాలు సవరించాయి. దాంతో మన మిరప రైతులు కూడా వాటికి తగ్గట్టుగానే సేంద్రియ పద్ధతుల్లో పండిస్తే మంచి గిరాకీ వచ్చే అవకాశం ఉంది

# మళ్లీ మీమర్లు, ట్రోలర్లకు పనిచెప్పిన జగన్ రెడ్డి! మీడియా మీట్ లో వ్యాఖ్యలు వైరల్



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. తాను మాట్లాడాల్సిన అంశాలు అన్నీ చాలానే ఉన్నప్పటికీ ఇప్పుడు రెండు అంశాలే మాట్లాడతానని, మళ్లీ వారం మాట్లాడటానికి కొన్ని అంశాలను వాయిదా వేస్తున్నట్లు జగన్ రెడ్డి చెప్పిన మాటలు వైరల్ అవుతున్నాయి. అన్నీ ఇప్పుడే మాట్లాడేస్తే ఓవర్ డోస్ అయిపోతుందంటూ జగన్ రెడ్డి వ్యాఖ్యానించడంపై పరిశీలకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని ఇరుకన పెట్టే సమాచారం సిద్ధంగా ఉన్నప్పుడు ఇంకో వారం కోసం ఆగడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.
మాజీ సీఎం జగన్మోహనరెడ్డి మీడియా సమావేశాలలో ఏదో ఒక పొరపాటు చేస్తూ ట్రోలర్లు, మీమర్స్ కి కంటెంట్ లోటు లేకుండా చేస్తారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే అసెంబ్లీకి రానంటూ భీష్మించుకుని కూర్చున్న మాజీ సీఎం జగన్మోహనరెడ్డి, అసెంబ్లీ జరుగుతున్న సమయంలో తన అభిప్రాయాలను మీడియాతో పంచుకుంటానని గతంలో చెప్పిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే గురువారం అసెంబ్లీలో జరుగుతున్న డీఎస్సీపై చర్చపై మాజీ సీఎం జగన్ మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వం సరిగా సమాధానం చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలిలో తమ పార్టీ ప్రశ్నలకు జవాబు చెప్పాల్సివస్తుందనే భయంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ మండలి వైపు చూడటం లేదని జగన్ విమర్శలు గుప్పించారు. డీఎస్సీపై మాజీ సీఎం చేసిన ఈ విమర్శలను రాజకీయ కోణంలో చూస్తున్న పరిశీలకులు, అదే సమయంలో ఆయన అనవసర వ్యాఖ్యలతో లేనిపోని విమర్శలు ఎదుర్కొంటున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు. "నాణేనికి ఇటు వైపున రెండు ప్రధాన అంశాలను టచ్ చేస్తా, టచ్ చేయాల్సిన అంశాలు ఇంకా చాలా ఉన్నప్పటికీ.. మళ్లీ నెక్స్ట్ కూడా మళ్లీ ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ కంటిన్యూ చేస్తా. లేదంటే ఇదే కాన్ఫరెన్సులో అన్నీ సబ్జెక్టులు తీసుకువచ్చేస్తే ఓవర్ డోస్ అయిపోతుంది" అంటూ జగన్ రెడ్డి చెప్పారు. దీంతో ఆయన వ్యాఖ్యలను మీమర్స్, ట్రోలర్లు సోషల్ మీడియాలో తిప్పుతున్నారు.
విపక్షంగా సమర్థంగా పనిచేసి ప్రజల అభిమానాన్ని చూరగొనాల్సిన మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే అంశాలు సిద్ధంగా ఉన్నప్పుడు ఓవర్ డోస్ అయిపోతుందని జాలి చూపడమే అంతుచిక్కడం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. డీఎస్సీపై మంత్రి లోకేశ్ బహిరంగ చర్చకు రమ్మంటూ సవాల్ విసురుతున్నా పట్టించుకోని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి తన ప్రెస్ మీట్ లో పాత విషయాలనే మళ్లీమళ్లీ లేవనెత్తారని అంటున్నారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఇప్పటికే అనేక విధాలుగా ఆందోళన చేస్తున్న వైసీపీ ఆ విషయంలో ఎంతవరకు అడ్వాంటేజ్ పొందిందో తెలియనప్పటికీ, అంతకంటే తీవ్రమైన అస్త్రాలు సిద్ధంగా ఉన్నప్పుడు ఇంకా వేచిచూడటం ఎందుకంటూ పరిశీలకులు సంధిస్తున్న ప్రశ్నలకు వైసీపీ నుంచి ఎటువంటి సమాధానం వస్తుందో చూడాల్సివుందని అంటున్నారు.

# కొత్త రిజర్వేషన్లతో ఎన్నికలు

**విజయవాడ, ఆగస్టు 20, పెన్ పవర్:**
ఏపీలో త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు ఏపీ ప్రభుత్వం బుధవారం నాడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలంటూ జీవో జారీ చేసింది. దాంతో ఏపీలో 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 87 మునిసిపాలిటీ పాలక వర్గాల గడువు ఇప్పటికే పూర్తయింది. మరో 13 పాలకవర్గాల గడువు నవంబర్‌తో ముగియనుందని అధికారులు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు నిర్వహణకుగానూ ఏపీ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘంతో సమన్వయం చేసుకుంటోంది.కోర్టు కేసుల కారణంగా రాష్ట్రంలోని మరో 23 మున్సిపాలిటీలో ఎన్నికలు వాయిదా వేశారు. అర్బన్ మున్సిపాలిటీలు, పట్టణాల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్‌తోనే ఎన్నికలు నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఇటీవల ఆమోదించిన బీసీ రిసర్వేషన్‌లు అమలు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రత్యేక సమగ్ర సవరణ తుది జాబితాలతో కాకుండా 2025 నాటి ఓటర్ల జాబితాల ఆధారంగానే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. అక్టోబరు 3న తుది జాబితాలు విడుదలయ్యే వరకు వేచి ఉంటే మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో తీవ్ర జాప్యం జరుగుతుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరులోనే ఎన్నికలు నిర్వహించాలని భావిస్తుండటంతో, ఓటర్ల జాబితాల రూపకల్పనకు రాజుజ నోటిఫికేషన్ (నెం.401/రాజుజ-ఖీ1/2026-1) జారీ చేసింది. మున్సిపాలిటీల్లో సెప్టెంబర్ 3 నాటికి, పంచాయతీల్లో ఆగస్టు 17 నాటికి ఓటర్ల జాబితాల ప్రచురణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ప్రక్రియను ఆగస్టు 21 నుంచి 31 వరకు పూర్తి చేయనున్నారు. అదనపు బ్యాలెట్ బాక్సుల సేకరణతో పాటు 45 రోజుల్లోగా సిబ్బంది శిక్షణ ప్రక్రియను పూర్తి చేసేలా ఈసీ ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది.

**1986 తర్వాత డైరక్ట్ఎలక్షన్స్**

ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపింది. దీనిద్వారా రాష్ట్రంలో మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేందుకు అవకాశం లభించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న పరోక్ష ఎన్నికల విధానంలో మార్పులు తీసుకువస్తూ ప్రభుత్వం ఈ చట్ట సవరణను చేపట్టింది. ఈ బిల్లును పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ బుధవారం నాడు సభలో ప్రవేశపెట్టారు. శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఎన్నికల విధానానికి సంబంధించి కొన్ని చారిత్రక అంశాలను వెల్లడించారు. 1986 వరకు పరోక్ష ఎన్నికలు జరగగా, ఆ తర్వాత 1986 నుంచి 2005 వరకు ప్రత్యక్ష ఎన్నికల విధానం అమల్లో ఉండేదని గుర్తుచేశారు. అయితే 2005 నుంచి పరోక్ష ఎన్నికలు సాగుతున్నాయని, ప్రస్తుత సవరణ ద్వారా మళ్లీ ప్రత్యక్ష ఎన్నికల విధానానికి అవకాశం వచ్చిందన్నారు. ప్రజలు నేరుగా తమ నాయకుడిని ఎన్నుకోవడం వల్ల ఆ పదవుల్లో ఉన్నవారికి నమ్మకమైన ప్రజామోదం లభిస్తుందన్నారు. కౌన్సిలర్లు లేదా కార్పొరేటర్లపై ఆధారపడాల్సిన అవసరం ఉండకపోవడం వల్ల మేయర్, చైర్మన్లపై వారి అనవసర ప్రభావం ఉండదని స్పష్టం చేశారు.ఈ విధానం వల్ల వేగవంతమైన నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం దక్కుతుందని, నగరాలు, పట్టణాలలో అభివృద్ధి ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేయవచ్చని మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, ప్రజా రవాణా, వ్యర్థాల నిర్వహణ, పట్టణ ప్రణాళిక వంటి మౌలిక వసతుల కల్పనలో దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించి అమలు చేయడం సాధ్యమవుతుంది అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలతో మెరుగైన సమన్వయం సాధించి అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు ఇది తోడ్పడుతుందని చెప్పారు.నగరాలు, పట్టణాల్లో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు పరిశ్రమలు, పర్యాటక రంగాలను ప్రోత్సహించేందుకు ప్రత్యక్షంగా ఎన్నికైన మేయర్ లేదా చైర్మన్‌కు పూర్తి వెసులుబాటు ఉంటుందని మంత్రి నారాయణ వివరించారు. ప్రత్యక్ష ఎన్నికల వల్ల అనవసర రాజకీయ ప్రభావం తగ్గి, ప్రజల నుంచి నేరుగా ఎన్నికైన నేతలు పట్టణాభివృద్ధిపైనే ప్రధానంగా దృష్టి సారిస్తుందన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని అన్ని వర్గాల ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సానుకూల ప్రయోజనాలన్నింటినీ దృష్టిలో ఉంచుకునే చట్ట సవరణ తెచ్చామని వివరించడంతో, బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. దాంతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్ల ఎన్నిక ప్రత్యక్ష ఎన్నికల విధానంలో జరగనుంది.

పెన్ పవర్ శుక్రవారం 21 ఆగస్టు 2026

# భారత్ నా రెండో ఇల్లు: ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ షేన్ వాట్సన్

- భారత్‌ను తన రెండో ఇల్లుగా అభివర్ణించిన షేన్ వాట్సన్
- ఆస్ట్రేలియా కంటే ఇండియాలోనే ఎక్కువ ప్రేమ, మద్దతు పొందానన్న షేన్ వాట్సన్
- సిడ్నీలో భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వ్యాఖ్యలు
- ఐపీఎల్ తన కెరీర్‌కు కీలక సమయంలో అద్భుతమైన వేదికనిచ్చిందని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా మాజీ స్టార్ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ భారత్‌ను తన రెండో ఇల్లుగా అభివర్ణించాడు. సొంత దేశం ఆస్ట్రేలియా కంటే భారత్‌లోనే తనకు అత్యధిక ప్రేమాభిమానాలు, మద్దతు లభించాయని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సిడ్నీలోని భారత కాన్సులేట్ నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా వాట్సన్ ఈ వ్యాఖ్యలు చేశాడు. భారత్‌లో క్రికెట్‌ను ఆరాధించే వారు సంఖ్య ఆస్ట్రేలియా కంటే ఎంతో అధికమని షేన్ వాట్సన్ పేర్కొన్నాడు. “భారత్‌లో నన్ను ఎవరూ పెద్దగా విమర్శించలేదని భావిస్తున్నాను. అక్కడ నాకు ఎప్పుడూ లభించే మద్దతు మరువలేనిది. ఆస్ట్రేలియాలో రాణించినప్పుడు ప్రశంసలు దక్కేవి, కానీ విఫలమైనప్పుడు విమర్శలు తప్పేవి కావు” అని వివరించాడు. భారత్‌తో పాటు ఇక్కడి ప్రజలతో తనకు విడదీయలేని అనుబంధం ఉందని, తన వ్యక్తిగత జీవితం, కెరీర్‌పై భారత్ చెరగని ముద్ర వేసిందని కొనియాడాడు.

తాను 19 ఏళ్ల ప్రాయంలో తొలిసారి భారత్‌ను సందర్శించానని, అప్పటి నుంచి ఈ దేశం సాధిస్తున్న అద్భుత ప్రగతిని నిశితంగా గమనిస్తున్నానని వాట్సన్ గుర్తు చేసుకున్నాడు. తనకు భారతీయ శాఖాహార వంటకాలంటే ఎంతో మక్కువని కూడా వెల్లడించాడు.

2008లో ప్రారంభమైన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్), తన కెరీర్ కీలక దశలో ఉన్నప్పుడు ఒక అద్భుతమైన వేదికను కల్పించిందని కృతజ్ఞత చాటుకున్నాడు. కాగా, వాట్సన్ ఐపీఎల్‌లో 2008 నుంచి 2020 వరకు రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించిన విషయం తెలిసిందే.

# 12 ఏళ్ల ఎదురుచూపులకు బ్రేక్: శ్రీలంకతో రెండో టెస్టులో సారంశ్ జైన్ అరంగేట్రం!





**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో భారత జట్టు 165 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ (ఔజ 2027) ఫైనల్ రేసులోకి దూసుకొచ్చింది. యంగ్ స్పిన్నర్ మానవ్ సుతార్ తన రెండో టెస్టులోనే 10/131 మైండ్ బ్లాకింగ్ ఫిగర్స్‌తో రచ్చ చేయగా, టీమిండియా స్టార్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌కు మాత్రం ఈ మ్యాచ్ తీవ్ర నిరాశనే మిగిల్చింది. రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి కేవలం 25 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసిన కుల్‌దీప్, ఓవర్‌కు 4.64 రన్ రేట్‌తో ధారాళంగా పరుగెచ్చి కేవలం ఒక్క వికెట్ మాత్రమే దక్కించుకున్నాడు. స్పిన్ ట్రాక్‌పై కుల్‌దీప్ ఈ స్థాయిలో తడబడటం ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. కుల్‌దీప్ యాదవ్ పర్ఫార్మెన్స్‌పై మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా తన యూట్యూబ్ ఛానెల్‌లో సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఇండియన్ టీమ్‌లో మిగతా స్పిన్నర్లతో పోలిస్తే కుల్‌దీప్ చాలా తక్కువ ఓవర్లు వేశాడు, పైగా భారీగా పరుగులు ఇచ్చాడు. రెగ్యులర్ ఛాన్సెస్ రావట్లేదనే సానుభూతి ఉన్నప్పటికీ, వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోవాల్సిన బాధ్యత అతనిపైనే ఉంది. ఈ ప్రదర్శన కుల్‌దీప్‌కు ఖచ్చితంగా ఒక వేకప్ కాల్.. ఇలాగే జరుగుతుంటే మేనేజ్‌మెంట్ ఎక్కువ కాలం సర్దుకుపోలేదంటూ కుల్‌దీప్ భవిష్యత్తు డైలామాలో పడిందన్నాడు.

**కుల్‌దీప్ ప్లేస్‌లో సారాంశ జైన్‌కు డెబ్యూ ఆఫర్?:**

రెండో టెస్టులో కుల్‌దీప్ స్థానంలో యంగ్ ఆఫ్‌స్పిన్నర్ సారాంశ జైన్‌ను బరిలోకి దించవచ్చని ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం మన జట్టులో జడేజా, మానవ్ సుతార్ రూపంలో ఇద్దరు క్వాలిటీ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్లు ఉన్నారు. వీళ్లిద్దరూ వికెట్లు తీస్తూనే బ్యాటింగ్‌లోనూ మంచి కాంట్రిబ్యూషన్ ఇస్తున్నారు. ఇక లంక టీమ్‌లో లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు ఎక్కువగా ఉన్నందున, వెరైటీ కోసం ఒక ప్రాపర్ ఆఫ్ స్పిన్నర్‌ని టీమ్‌లోకి తెస్తే బాగుంటుందని చోప్రా చెప్పుకొచ్చాడు.

**రెండో టెస్టులో భారత్ ప్లేయింగ్ XI ఎలా ఉండబోతోంది? :**

శ్రీలంకతో జరగబోయే రెండో టెస్టులో టీమిండియా మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. కొలంబో వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో కుల్‌దీప్‌కు మరో అవకాశం ఇస్తారా లేక కొత్త వ్యూహాలతో సారాంశ జైన్‌ను మైదానంలోకి దించుతారా అనేది సస్పెన్స్‌గా మారింది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో ప్రతి మ్యాచ్ కీలకమైనందున, శుభ్‌మన్ గిల్ సేన ఎలాంటి తుది జట్టుతో బరిలోకి దిగుతుందో లేదో చూడాలి మరీ.

# క్రికెట్ ప్రసారాల్లో కొత్త విప్లవం.. ఫిఫా టెక్నాలజీతో ఇండియా-ఆఫ్ఘన్ సిరీస్!







**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య జరగబోయే టీ20 సిరీస్, క్రికెట్ ప్రసారాల చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించబోతోంది. సెప్టెంబర్‌లో జరగనున్న ఈ సిరీస్‌ను, ఇటీవలి ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్ తరహాలో అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ప్రసారం చేసేందుకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సిరీస్ ప్రసార హక్కులను దక్కించుకున్న ఐటీడబ్ల్యూ యూనివర్స్ సంస్థ, మునుపెన్నడూ లేని విధంగా వీక్షకులకు సరికొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమవుతోంది.

క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. ఈ సిరీస్ ప్రసారాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత స్టెబిలైజ్డ్ కెమెరాలు, వాల్యూమెట్రిక్ ఫ్రీ-వ్యూపాయింట్ టెక్నాలజీ, అత్యాధునిక స్పైడర్‌క్యామ్, అల్ట్రా-మోషన్, సినిమాటిక్ స్టోరీ టెల్లింగ్ వంటి ఫీచర్లను తొలిసారిగా ఒక ద్వైపాక్షిక సిరీస్‌లో ప్రవేశపెట్టనున్నారు. వీటికి అదనంగా క్విడిచ్ ఇన్నోవేషన్ ల్యాబ్స్ రూపొందించిన ‘స్పాటియో’ సిస్టమ్‌ను కూడా ఉపయోగించనున్నారు. ఈ టెక్నాలజీ సాయంతో డ్రోన్ ఫీడ్‌పై ఆగ్మెంటెడ్ రియాలిటీ గ్రాఫిక్స్‌ను జోడించి, ఆటగాళ్ల కదలికలను రియల్ టైంలో ట్రాక్ చేయవచ్చు. దీని ద్వారా ఫీల్డ్ ప్లేస్‌మెంట్, వ్యూహాలను చాలా వినూత్నంగా చూపించే అవకాశం ఉంటుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు జేమీ ఓక్‌ఫోర్డ్ దర్శకత్వం వహించనున్నారు. ఆయన 2002 నుంచి ప్రతి ఫిఫా ప్రపంచకప్‌లో పనిచేయడమే కాకుండా 2014 ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫైనల్‌కు కూడా డైరెక్టర్‌గా వ్యవహరించారు. “ఒక ద్వైపాక్షిక సిరీస్‌ను పూర్తిస్థాయి ఫిఫా ప్రపంచకప్ ప్రసార ప్రమాణాలతో నిర్మించడం ఇదే తొలిసారి. ప్రపంచకప్ ఫైనల్స్‌కు పనిచేసిన నిపుణులే ఈ సిరీస్‌కు పనిచేస్తారు” అని ఐటీడబ్ల్యూ యూనివర్స్ ఒక ప్రకటనలో పేర్కొంది. “ప్రేక్షకులకు మైదానంలో అత్యుత్తమ సీటులో కూర్చున్న అనుభూతిని అందించడమే మా లక్ష్యం” అని సంస్థ వ్యవస్థాపకుడు భైరవ్ శాంత్ స్పష్టం చేశారు. భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య మూడు మ్యాచ్‌ల ఈ టీ20 సిరీస్ సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో జరగనుంది. ఈ మ్యాచ్‌లన్నింటికీ ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదిక కానుంది. కాగా, ఈ సిరీస్‌కు ఆఫ్ఘనిస్థాన్ జట్టు అధికారిక ఆతిథ్య జట్టుగా వ్యవహరిస్తుండటం విశేషం.

# అట్లీ అనుభవించిన ఒకే చిత్రం!



నిక్కీ తంబోలి ఆకర్షణీయమైన గ్లామరస్ లుక్





యాషిక ఆనంద్ షీర్ బ్లాక్ గౌన్‌లో స్టన్ చేసింది

ప్రఖ్యాత దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన విజువల్ వండర్ -ది ఒడిస్సీ- సినిమాపై కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ ప్రశంసల జల్లు కురిపించారు. ఈ సినిమాను తాను థియేటర్‌లో అనుభవించిన తీరు గురించి చెబుతూ సోషల్ మీడియా వేదికగా సుదీర్ఘమైన భావోద్వేగ నోట్‌ను పంచుకున్నారు. సాధారణంగా మనం సినిమాలను చూస్తామని.. కొన్నింటిని మెచ్చుకుంటామని...కానీ కొన్ని సినిమాలు మాత్రం మనల్ని పూర్తిగా వేరే లోకానికి తీసుకువెళ్తాయని అట్లీ పేర్కొన్నారు. -ది ఒడిస్సీ- తనకు అలాంటి అద్భుతమైన అనుభూతినే అందించిందన్నారు. ఈ చిత్రంలో నోలన్ నరేషన్ విధానం ఎంతో ఆశ్చర్యకరంగా ఉందని అట్లీ అభిప్రాయపడ్డారు. సినిమాలో ప్రతీ విజువల్ ప్రత్యేకమైన భాషను కలిగి ఉంటుందని.. కెమెరా దృశ్యాలను చూపడమే కాకుండా కథలో మరో పాత్రలా ప్రయాణిస్తుందని తెలిపారు. అలాగే లూడ్విగ్ అందించిన సంగీతం సినిమా నేపథ్యానికి మాత్రమే పరిమితం కాలేదు. చూసేవారి రక్తంలోకి ఇంకిపోతుందంటూ సంగీత దర్శకుడి ప్రతిభను ఆకాశానికెత్తారు. థియేట్రికల్ అనుభవం గురించి మాట్లాడుతూ.. తాను థియేటర్‌లో ఎప్పుడూ అనుభవించని అడ్రినలైన్ రష్ ..ఇమ్మర్సివ్ ఫోర్స్‌ను ఈ సినిమా ద్వారా అనుభవించానన్నారు. ప్రేక్షకులు తమను తాము పూర్తిగా సినిమాకు అంకితం చేసుకునేలా చేసేదే అసలైన ఎపిక్ సినిమా అని -ది ఒడిస్సీ- సరిగ్గా అదే కోవకు చెందుతుందని అట్లీ అభివర్ణించారు. ఈ సినిమాను చూడటమే కాదు.. దానిని ఒక అనుభవంగా జీవించవచ్చని తెలిపారు. ఇంకా సినిమా చూడని ప్రేక్షకులకు అట్లీ ఓ సలహా కూడా ఇచ్చారు. ఈ విజువల్ వండర్‌ను కచ్చితంగా ఐమ్యాక్స్ స్క్రీన్లపైనే అనుభవించాలని కోరారు. సినిమా మనల్ని చుట్టుముట్టేలా? మనల్ని పూర్తిగా తనలోకి లాక్కునేలా ఐమ్యాక్స్ అనుభూతి ఉంటుందన్నారు. -కొన్ని సినిమాలు కేవలం చూడటానికి మాత్రమే ఉంటాయి. మరికొన్ని సినిమాలు అనుభవించడానికి మాత్రమే పుడతాయి- అంటూ అట్లీ పోస్టును ముగించారు.

దీంతో -ది ఒడిస్సి-కి మరింత హైప్ క్రియేట్ అవుతుంది. నచ్చిన విదేశీ చిత్రాలను ప్రోత్సహించడంలో టాలీవుడ్...కోలీవుడ్ డైరెక్టర్లు ఎప్పుడూ ముందుంటారు. కంటెంట్..మేకింగ్ నచ్చిందంటే? ఆ చిత్రాన్ని నిర్మొహమాటంగా ఆకాశానికి ఎత్తేస్తారు. ఇలాంటి సినిమాల విషయంలో దర్శక దిగ్గజం రాజమౌళి కూడా అంతే ఉత్సాంహం గా మాట్లాడుతుంటారు. ప్రస్తుతం ఈ ఇద్దరు దిగ్గజ దర్శకులు పాన్ వరల్డ్ మార్కెట్ ను టార్గెట్ చేసిన సంగతి తెలిసిందే. వారణాసిని రాజమౌళి 120 దేశాల్లో రిలీజ్ చేస్తుంటే? ఆ సినిమా ఫలితం చూసి రాకాను అంతకు మించి భారీ ఎత్తున రిలీజ్ చేయాలని అట్లీ ప్లాన్ చేస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com